# పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజ గారితో

## భక్తుల అనుభవాలు



సేకరణ : పె.సుబ్బరామయ్య

సర్వస్వామ్యములు
శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్టు

కాపీలు - 5000

కాపీలకొరకు:

శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్టు
గొలగమూడి (PO)
(Via) సర్వేపల్లి
నెల్లూరు జిల్లా A.P. – 524 321

## పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు

### ఆశయం:

1. కనీసం కొంతసేపైనా ఈ మలిన మనస్సును వారి దివ్యలీలా చింతనలో పెట్టవలెననెడి ఆశయే.
2. శ్రీ మాష్టరుగారితో డైరెక్టుగా పరిచయమున్న వారుగాని, వారి రచనలతో పరిచయమై వారినే గురువుగా భావించిన వారుగాని వారి దివ్యస్థితి ఎడల స్వరైన అవగాహన కలిగి వారు బోధించి, ఆచరించి చూపిన దివ్యమార్గములో పయనిస్తారని ఆశిస్తున్నాను.

### విన్నపము:

ఆ మహనీయుడు బోదించిన వాటిలో ఆచరించి చూపిన వాటిలో చాలా ముఖ్యమైనది, అతి సులభమైనది సత్‌సంగము. ఇప్పటికి కూడా ఒకరి అనుభవాలు మరియొకరికి చెప్పుకోకుండా దాచి పెట్టుకుంటున్నాము. మానవోద్దరణకై భూమిపై అవతరించిన శ్రీ మహావిష్ణువు లీలలు గ్రంధస్థము కాకుండా దాచిపెట్టుకోవడం - "మనకంటే గాడిదలే మేలు" అన్న శ్రీ మాష్టారిగారి మాట సత్యమని నిరూపిస్తుంది. భక్తులు శ్రీ మాష్టారితో వారి అనుభవాలు వ్రాసి, పూర్తి అడ్రసు, సంతకంతో నాకు పంపించి శ్రీ మాష్టారుగారి ఆశీస్సులు పొంద ప్రార్థన.



### సాధకులకు శ్రీ మాష్టారి అమృతమయ సలహాలు:

1. లౌకిక జీవితంలో స్వార్థము కంటే ఆధ్యాత్మిక జీవితంలోని స్వార్థం చాలా నికృష్టమైనది.
2. రాగ ద్వేషములు జయించకుండా నెలల తరబడి ధ్యానం చేసినా వారి సాధనంతా పునాదులు లేని మేడవలే కూలిపోతుంది.
3. దేనిమీద ఆశలేకుండా పోవడమే తితీక్ష.
4. గురువుగారి ఆదేశాన్ని తూ||చ|| తప్పక ఆచరించడమే సాధన.
5. అమాయకులు సాధన పేరుతో భౌతిక శరీరాన్ని హింసించుకుంటారు. తెలివి గల ధైర్యశాలురు నిజ శత్రువైన మనస్సుపై దాడి చేస్తారు. కుక్క మనిషి చేతిలోని కర్రను కరుస్తుంది. కానీ పులి తనకు దెబ్బలు తగలకుండా కర్రను పట్టుకొన్న మనిషిని కరుస్తుంది.
6. ఆధ్యాత్మిక మార్గంలో మొదట రాగ ద్వేషాలు జయించాలి గనుక ఇక్కడికి వచ్చిన వారికి ఇష్టం లేని పనిపెట్టడం, ఇష్టం లేని సన్నివేశంలో ఇరికించడం చేస్తాను. అప్పుడు వారు చాలా అశాంతికి గురి అవుతారు. నేనలా చేయకుంటే వారు ఇతరులకు అశాంతి కల్గిస్తుంటారు.
7. నే నెంతో ప్రేమగా ఉన్నా నాలో ప్రేమ లేదు. నే నెంతో క్రూరంగా కనిపించినా నాలో క్రూరత్వమే లేదు. నే నెవరినో నాలోతు ఎవ్వరు గ్రహించలేరు.

8. నావద్ద ఎవరిని స్థిరపడనిచ్చినా చాలా స్వార్థంగా తయారవుతారు.
9. నా ప్రారబ్ధంలో రిక్షావాలాగా ఉండాలని ఉంటే మానసికంగా బాధపడి ప్రయోజనమేమిటి. అందరిలాగానే నేనూ కష్టపడి రిక్షాతొక్కి సంతోషంగా ఉంటే సరి. అంతటికీ మనసే కారణం. మన మనసును సముదాయించాలి, బాధపడి లాభంలేదు.
10. స్వార్థంతో సాధన చేయడం కంటే ఇతరులకొరకు మన సాధన త్యాగం చేస్తే మనం గొప్పగా ప్రగతి సాధిస్తాము. ఎందుకంటే అందరూ ఆత్మ స్వరూపులే గనుక. మనం స్వార్థంతో వ్యవహరించినంతసేపూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రగతి సాధించలేము.
11. దానం చేసే ఉద్దేశ్యంతో డబ్బు సంపాదించవద్దు.
12. ముక్తి మార్గానికి అడ్డంకులు స్త్రీలు, సంపద... వారిని వదిలి అడవికి పోవడం అని అర్థం కాదు.
13. మనకిష్టంలేని వారు మన రూములో ఒక చిన్న సంచిపెట్టాలన్నా మనకు కష్టమే. మనకిష్టమైన వారు ఒక లారీ సామాను పెట్టినా మనకు సంతోషమే. అడ్డంకు అంతరంగములోనిదే.
14. కాకతాళీయంగా జన్మచేత మాత్రమే బంధువులని అంతకు మించిన బంధం వ్యర్థమేగాక అనర్థమని గ్రహించాలి.
15. ఇంకేసాధనా ఉపకరించనపుడు ఒక్కొక్క మహాత్ముని గురించి బాగా వివరంగా జ్ఞాపకం తెచ్చుకోవాలి. వారి



వైరాగ్యం గురించి, పట్టుదల, తీవ్ర ప్రయత్నం గురించి చింతన చేయాలి.
16. అత్యవసరం కానిదేది సంపాదించకూడదు. కోరితే అది వెర్రి తలలు వేసి పెడదారి పట్టిస్తుంది.
17. 'నా' 'పర' అన్న భావాలు, ఇష్టా ఇష్టాలు వీటిని విడవడం కంటే త్యాగం వేరే ఉండదు.
18. అవసరం, బాధ ఇతరులలో గుర్తించి అవసరమైనవే ఇవ్వడం దానం.
19. ఎప్పుడూ పరమాత్మయందు మనసు నిలపడమే ఆసనసిద్ధి.
20. గొప్ప నావికుడు ఏ గాలికి ఆ తెరచాప ఎత్తి ఎట్లాగైనా తన పడవ ముందుకు సాగేలా చూచుకుంటాడు. అలానే సాధకుడు దైవస్మరణను మంచి చెడు కాలాలలో తన దైవాన్ని చేరుకునేందుకు వినియోగిస్తాడు.
21. ఓ భగవంతుడా నాహృదయంలోని జ్ఞానకాంక్ష అనే నిప్పురవ్వను ప్రజ్వలింపచేసి "నేను" అన్న భావాన్ని దాన్ని ఆశ్రయించిన దు:ఖము, అసంతృప్తి, భయ, కామ, క్రోధ, అనృతాలను నాశనం చేసి నా నాథుడవని నిన్ను నీవు నిరూపించుకొని ఏలుకో తండ్రీ అని ఆర్తితో నిత్యం ప్రార్థన చేస్తుండాలి.
22. ఉపాసనంటే ధ్యాసను నిరంతరం నిలుపుకోవడం, నిరంతరం నిలుపుకుంటే తానే ధ్యేయవస్తువవుతాడు.

## కోటలో దామోదర్ చేత స్కూల్ పెట్టించడం:

కోటలో కాన్వెంట్ స్కూల్‌ను పెట్టమని మాష్టారు మరల మరల దామోదర్‌కు నచ్చచెప్పేవారు. అతను ఎంతసేపటికీ నేను అడుక్కుతినైనా బ్రతుకుతాను కానీ మీ దగ్గరే ఉంటాను, అనేవాడు. అడుక్కు తిననవసరంలేదు, నేను పోషిస్తాను కానీ నీవు కాన్వెంట్ స్కూల్ నడిపితే ఉచితంగా నావద్ద తినే అవసరం లేదు. ఎందరికో ఉపయోగపడుతుంది అని ఇంచుమించు ఒక నెల రోజులు ఎంతో ఓర్పుతో నచ్చ చెప్పి ఒప్పించి కాన్వెంట్ స్కూల్ పెట్టించారు. మనదేశంలో ఆధ్యాత్మికత పేరుతో లెక్కలేనంతమంది అడుక్కుతినడం, కాషాయం కట్టడం చూస్తున్నాము. అలా చేయడం ఆధ్యాత్మికానికే కళంకం ఆపాదించినవారము అవుతాము అని చెప్పేవారు.

## కుక్కలకు అన్నం పెట్టడం:

మాష్టారు కుక్కలకు అన్నం పెట్టడం చాలా చిత్రంగా ఉండేది. అవి తినేవిధం అత్యాశ్చర్యంగా ఉండేది. మాష్టారు ఎంత వండేవారో కానీ పెద్ద ప్లేటునిండుగా కుక్కలకు అన్నం పెడితే అక్కడ ఉన్న మూడు కుక్కలలో ఒక కుక్క వచ్చి తినిపోయాక మరొక కుక్క వచ్చి తినేది. ఒక కుక్క తినిపోగా కొంతే మిగిలిఉంటే మరల ప్లేటునిండుగా పెట్టేవారు. మరల ఆ కుక్క కడుపునిండా తిని ప్లేటులో కొంచెం మిగిల్చేది. అ తర్వాత మరొక కుక్క రావటం మరల ప్లేటునిండా పెడితే అది



కడుపునిండాతిని కొంత మిగల్చడం ఇలా కుక్కలు కూడా జాతి వైరం మాని తిని వెళ్ళేవి. మాష్టారు అంత దండిగా వండి ఆ కుక్కల రూపాలలోని బాబాకు నివేదించేవారు.

## మాష్టారు ఎందరినో అన్నంపెట్టి చాకటం:

"ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో, నీవద్దకు వచ్చిన ఏ ప్రాణినీ తోలివేయవద్దు" అన్న సాయి సూక్తిని మాష్టారు ఎంతగొప్పగా ఆచరించి ఆదర్శముగా నిలిచారో అన్నదానికి మచ్చుతునక. మాష్టారు ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పుడు సైతం వారిపై ఆధారపడినవారిని, మరే ఆధారములేక వారివద్దకు చేరినవారిని, వారి సాంగత్యం కోసం వారి వద్దకు చేరిన వారిని ఎంతో ప్రేమతో వారికి భోజన వసతి, ఇతర ఖర్చులు సైతం భరించారు.

ఇంట్లో మాష్టారు, అమ్మగారు, వేదవతి (2 సం|| పాప), వీరితోటి నిత్యం భోంచేసేవారు సత్యంగారు, విక్రం గారు, అనసూయమ్మగారు, మాష్టారి అత్తగారు, మద్రాసు లక్ష్మిగారు, పనిపిల్ల, వీళ్ళేగాక హమేషావచ్చే అతిథులు. ఇద్దరుండే ఇంట్లో ఎందరు భోంచేస్తారో చూడండి. వీళ్ళు మాత్రమే గాక బయట మెస్‌లో నిత్యం పర్మినెంట్‌గా భోంచేసేవారు పదిమంది ఉండేవాళ్ళు. వీళ్ళేకాక దూరపు వూళ్ళ అతిథులు. పర్మినెంట్‌గా తినేవాళ్ళకు ఖర్చులకు డబ్బుకూడా ఇచ్చేవారు. వీరి పేర్లు వ్రాయడం భావ్యం కాదని ఇక్కడ వ్రాయడం లేదు.

ఒకసారి శేషగిరిరావు అనే పూజారి - ఇలాంటి చిల్లపెంకులందరినీ ఎందుకు దగ్గరతీస్తున్నారండీ అంటే వాళ్ళనే కదా నేను బాగు చేయవలసినది అన్నారు. మీరు చేరదీసి వాళ్ళను చెడగొడుతున్నారని వాళ్ళ తల్లిదండ్రులు మిమ్ములను తిడుతున్నారు సార్ అని నేనంటే సుబ్బరామయ్య చౌల్ట్రీ, లాడ్జింగ్‌లకు, ఇంటికి బేధమేమిటి అని అడిగారు. సమాధానం వారే చెప్పారు. ఇంట్లో ఆప్యాయత, ప్రేమ ఉంటాయి. చౌల్ట్రీ, లాడ్జింగ్‌లలో అవి ఉండవు. అవి లేకపోబట్టే వాళ్ళు ఇంటికి పోకుండా ఇక్కడే ఉన్నారు. వాళ్ళను వెళ్ళిపొమ్మని నేనెలా చెప్పగలను అన్నారు.

## ఇతరుల అన్నం తింటే వారి సంస్కారాల ప్రభావం మనపై ఉంటుందా? అన్నదానికి మాష్టారి జీవిత సంఘటనలలోని సూచనలు:

1. ప్రక్క ఊరిలో ఒకామె మాష్టారిని భోజనానికి ఎన్నిసార్లు పిలిచినా మాష్టారు చూద్దాము, అనే వారే కానీ వెళ్ళేవారు కాదు. ఒకసారి ప్రసాదు మాష్టారిని బలవంతపెడితే వారి ఇంటికి వెళ్ళి టిఫిన్ మాత్రం చేసి వచ్చారు. వచ్చేరావటంతోనే మాష్టారికి వాంతులయి జ్వరం వచ్చింది. అప్పుడు ప్రసాదు మాష్టారిని పరామర్శించేందుకుపోతే మాష్టారు "చెబితే వింటారటరా మీరు?" అన్నారు. ఆ మాటతో వారు ఆమె ఇంటికి వెళ్ళి ఆమె చేతితో తయారు చేసినది



తినటం వల్లనే ఈ అనారోగ్యం వచ్చింది అని తెలియబరచారు.

ఇలాగే ఇతరుల వద్ద తింటే వాళ్ళ సంస్కారాల పాపం ప్రభావం ఉంటుందని తెలియబరచే మరో సంఘటన.

మరొకరు ఎవరో భోజనానికి పిలిస్తే వెళ్ళి వచ్చిన తరువాత మాష్టార్ని భోజనం ఎలాఉంది అన్న వారితో "నిప్పుల గుండంలో కూర్చున్నట్లుందిరా" అన్నారు.

2. (విద్యానగర్‌లో) సత్సంగానికి వచ్చిన పిల్లలందరినీ మిద్దెపైకి తీసుకెళ్ళి ప్రసాదు భజన చేయించేవాడు. అలా వచ్చే పిల్లలలో నలుగురు నాస్తికుల పిల్లలుకూడా ఉన్నారు. ఆ నాస్తికునికి ఇది గిట్టక అచ్చట సత్సంగానికి వెళితే చెంప పగలగొడతానని ఆ నలుగురు పిల్లలనేకాక ఇతరులను కూడా బెదిరించాడు. వాళ్ళు రావడం మానేశారు. ఇలా బెదిరించిన అతనికి తేలు కుట్టింది. అది మందులకు తగ్గకపోగా గూడూరు వెళదామనుకుంటుంటే ఎవరో సలహా ఇస్తే మాష్టారి వద్దకు అతనిని తీసుకొచ్చారు. మాష్టారు విభూది ఇస్తే వెంటనే అంత నొప్పి తగ్గిపోయింది. అప్పటి నుండి అతను వాళ్ళ పిల్లలనే కాక ఇతరులను కూడ సత్సంగానికి వెళ్ళమని ప్రోత్సహించి మరీ పంపేవాడు. నాకు సాయిబాబా దేవుడు అవునో, కాదో తెలియదుకానీ మాష్టారే దేవుడు అనే భావంతో పంపేవాడు.

## చి|| కోటేశ్వరి అనే ఆమెకు టాన్సిల్స్ నయం చేయడం:

చి|| కోటేశ్వరి అనే అమ్మాయి టాన్సిల్స్ వల్ల సరిగా ఎదగలేదు. మాష్టారికి విన్నవించుకుంటే పారాయణ చేయ మన్నారు. శ్రీ సాయిలీలామృతం పారాయణ మొదలుపెట్టిన కొద్దిరోజులలోనే సాయిబాబా డాక్టరుగా, క్షేత్ర పోలస్వామి కాంపౌడరుగా దర్శనమిచ్చారు. పోలేరమ్మ (నర్సు), భయంలేదు నోరు తెరువమన్నది. ఆమె తెరిస్తే బాబా ఆపరేషన్ చేసారు. తరువాత మెళకువ వచ్చింది. నాటితో ఆమె వ్యాధి పోయింది.

విద్యానగర్ ప్రక్క కొత్తపాళెం గ్రామ కాపురస్తుడు రామిరెడ్డి గోపాల్‌రెడ్డి గారి పాప మల్లిని పురిటిలో బిడ్డగా ఉండగా రైలెక్కించడంలో విధివశాత్తు క్రిందపడి అంగవైకల్యం కల్గింది. లక్షలు ఖర్చుపెట్టినా నయంకాలేదు. నడుములపైన బిడ్డ ఎదుగు తుంది. రెండు కాళ్ళు స్వాధీనంలో లేవు. ఒక రోజు శ్రీ మాష్టార్ గారు వారింటికి పోయి బాబాకు నివేదించిన పాయసం పాపకు తినిపించి వచ్చారు. తెల్లవారినుండి పాప క్రమంగా నడవడం మొదలుపెట్టింది. దేవుడున్నాడో లేడో నాకు తెలియదు శ్రీ మాష్టారే నాకు దైవం అంటారు శ్రీ గోపాలరెడ్డి గారు. ఇందుకు కృతజ్ఞతతో వెయ్యిన్ని ఎనభై మార్లు సాయి చరిత్ర పారాయణ ఆపకుండా చేశారు.

శ్రీ మాష్టారు ప్రక్క గ్రామంలోని కొండ పైనున్న దేవాలయంలో ధ్యానము చేసుకుని వస్తున్నారు. టైం రాత్రి



2 గం. ఒక కాలేజి విద్యార్థి ఎదురుపడి అర్ధరాత్రి వేళ పాదరక్షలు లేకుండా వస్తున్నారు. పురుగు పుట్రా వుంటాయి సార్, అన్నారు. శివుని ఆజ్ఞ లేక చీమైనా కుట్టదు అన్నారు మాష్టారు. ఆ విద్యార్థి కాలు కదిలించి ప్రక్కకు వేశాడు. సగం తేలు కాలి చెప్పుకింద పడింది. కొండె బయట ఉండి పాదం మీద పొడిచింది. విలవిల లాడుతున్నాడు. శివుని ఆజ్ఞ లేక చీమైనా కుట్టదంటే ఇదే అని ఆ విద్యార్థిని తన రూముకు తీసుకువెళ్ళి విభూది పెట్టి అతని బాధ నివారణ చేశారు.

ఒక పాత విద్యార్థి మాష్టారిని తరచు మంచి ధ్యాన స్థితి ప్రసాదించమని అడిగేవారు. మాష్టారు "వాచా సూరత్వం మాని క్రియా సూరత్వం చూపు, అర్హతకు మించి శక్తిని ప్రసాదిస్తే భరించలేవు" ఇలా చెప్పేవారట. కానీ వీరు తరచుగా అడిగిన మీదట ఒకసారి వారు మాష్టారి సన్నిధిలో కూర్చొని మనసులో నామస్మరణ చేసుకుంటుంటే దాని కనుగుణంగా మాష్టారు పుస్తకం చదువుకుంటూ ఈల వేయ సాగారు. మాష్టారు ఆ నామాలకు అనుగుణంగా ఈల వేసే కొద్దీ వీరి కంతకంతకు ధ్యానం బాగా కుదరనారంభించింది. మాష్టారు అన్నం తిని వచ్చి వీరిని లేపే వరకు, స్పృహ లేని ధ్యానంలో మునిగిపోయారు. ధ్యానం నుండి బయటకు వచ్చి ఇంటికి వెళ్ళినప్పటి నుండి విరోచనాలు మొదలు అయ్యాయి. రాత్రి అంత విరోచనాలు కాగా మరురోజు వాళ్ళ ఇంటి వారు మాష్టారికి ఈ సంగతి తెలిపితే ఏ డాక్టరు వద్దకు పోనవసరము లేదు అవే తగ్గిపోతాయి అని చెప్పారు. అలానే మూడవ రోజుకు అవి తగ్గాయి. తరువాత

మాష్టారి సూచనకు అర్ధం, "అర్హతకు మించి ప్రసాదిస్తే భరించలేరు" అన్నది అర్ధమయింది శరీరాన్ని కూడా ఆ స్థితి పొందేందుకు సిద్ధం చేసిన తరువాతనే ఆ స్థితిని భరించగలమని తెలుస్తుంది.

## ఆపధ్బాంధవుడు:

సత్‌సంగానికి ప్రతి గురువారము తప్పక సాయంత్రం 4 గం|| కే వచ్చి వెళ్ళే యానాదులను చూపుతూ "సుబ్బరామయ్యా నిజమైన భక్తి అంటే వీరిదే. వీరు వరి చేలలో కావలి ఉంటారు. అక్కడే గుడిసెలో వీరి నివాసం. వీళ్ళింట్లో ఒకరు మార్చి ఒకరు ఎప్పుడూ జబ్బుతో మంచము పట్టి వుండేవారు. ఎవరో చెబితే ఇక్కడకు వచ్చి చెప్పుకున్నారు. నేనా మహనీయుని ఊది పొట్లమిచ్చి గుడిసెలో జాగ్రత్తగా ఒక చోట పెట్టి నిత్యం సాంబ్రాణి కడ్డీ వెలిగించి దండం పెట్టుకోమని చెప్పాను. వారలా చేయసాగాక మరలా ఎవరికీ జబ్బు చేయడం లేదట. పాపం ప్రతి గురువారము అందరూ తల స్నానం చేసి ఉతికిన గుడ్డలు ధరించి తన పేద సంపాదనలో అర్ధ రూపాయి గాని, రూపాయి గాని, ఖర్చు చేసి నైవేద్యం తెస్తారు. నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి నడిచి పోతారు. మనమంతా మనకు మిగిలి ఆదా చేసిన దాంట్లో బాబాకు నైవేద్యం పెడితే వాళ్ళు వారి నోటి దగ్గర ముద్దనే త్యాగం చేసి బాబాకు నైవేద్యం పెడుతున్నారు. వారిది గదా నిజమైన భక్తి. ఒక వారం విడవకుండా ప్రతి వారం అందరూ వస్తారు అని చెప్పారు.



ఆ మహనీయుని విభూతి ఎవరు పెట్టినా బాధ తగ్గుతుంది అని చెప్పేవారు. ఒక విద్యార్థి మేము పెడితే తగ్గదు సార్ అంటే, నీవు తేలు కుట్టిన వారికి పెట్టు తగ్గుతుందో లేదో చూస్తాం అంటారు. ఆ విద్యార్థి మీరు ఉన్నప్పుడు మేము విభూది పెడితే తగ్గుతుంది మీరు లేనప్పుడు పెడితే తగ్గదు అన్నాడు. విభూది మనమే పెట్టినా సంకల్పించేది వారని అర్ధమవుతుంది.

## మనం తినే ఆహారం గురించి ఎలాంటి భావముండాలి:

ఒక రోజు ఒంగోలులో శ్రీ మాష్టారికి వాసన వస్తున్న పులిసిన పదార్ధం నిన్నటిది వడ్డించారు. ప్రక్కనున్న పాత విద్యార్థి "సార్ ఇది మీకు గిట్టని పదార్ధం కదా? వాళ్ళకు చెప్పకూడదా అంటే - మాష్టారు ఒక్క సారి ఉష్... అని నోటి మీద వేలు పెట్టి, ఆకలిగా ఉన్నప్పుడు, ఆకలి తీర్చేందుకు ఏది వస్తే అది బాబా ప్రసాదంగా భావించి తీసుకోవాలి అని చెప్పారు. వారి సంపాదనతో జీవిస్తున్న వారి నిర్లక్ష్యాన్ని కూడా మాష్టారు పట్టించు కోవడం లేదు. ఆహారాన్ని గురించి మన భావాలెలా ఉంటాయో మనం యోచించుకోవాలి.

ఒకసారి శ్రీ మాష్టారు గారు డి. సూర్య ప్రకాశరావు గారితో అన్నారట - "నా విస్తర ప్రక్కన అమేధ్యమున్నా (మలం) నేను మామూలుగానే భోం చేస్తాను" అన్నారట వారికి సర్వం భగవన్మయముగా కనిపిస్తుంది గాబోలు.

శ్రీ మాష్టారి అనుమతి లేకుండా వారి ఉపన్యాసం టేప్ చేస్తే రాలేదు. అట్లాగే వారి అనుమతి లేకుండా ఫోటోలు తీసినవి రాలేదు, వారు ఇప్పుడు తీసుకో అని చెప్పిన ఫోటోలు చక్కగా వచ్చాయి.

## K. హరిబాబు గారి అనుభవాలు

### నన్ను మాష్టారికి దూరం కాకుండా చేసిన సన్నివేశం:

నేనప్పుడు గోవాలో పని చేస్తున్నాను. రత్నగిరి జిల్లాలో ఒక మహాత్ములున్నారు దర్శించుకో అని శ్రీ మాష్టారు నాకు లెటరు వ్రాశారు. నేనక్కడ విచారిస్తే ఎవరూ చెప్పలేదు. అక్కడ ఉండే వాళ్ళకే తెలియదు కానీ ఎంతో దూరంలో ఉన్న మాష్టారికి ఎవరు ఎక్కడ ఉండేది తెలుస్తుంది. మన ఆధ్యాత్మిక ఉన్నతి పట్ల వారి కెంత ఆసక్తో చూడండి. మాష్టారు వ్రాశారు కనుక పట్టు విడవకుండా విచారిస్తే శ్రీ మోటా మహరాజ్ అనే మహాత్ములున్నారని తెలిసింది. వారిని దర్శించాను.

శ్రీ మాష్టారు విద్యానగర్ నుండి ఒంగోలు వెళ్ళినాక శ్రీ మాష్టారు భక్తులే కొందరు "శ్రీ మాష్టారు మారిపోయారు. ఆధ్యాత్మిక స్థితి కోల్పోయారు" అని చెప్పుకోవడం విని నాలో కొంత సంశయం కల్గింది. నేను గోవాలో శాండిల్ మహరాజ్ అనే మహనీయుని ప్రదేశానికి వెళ్ళి ధ్యానం చేసుకునే వాడిని. ఒకనాటి నాస్వప్నంలో నా సమీపాన శ్రీ మాష్టారిని చూసి వెళ్ళి



పాదనమస్కారం చేశాను. శ్రీ మాష్టారు వంగి నన్ను పట్టుకున్నారు. వెంటనే నా శరీరంలో స్ట్రెస్ అంతా పోయి బెండు లాగా అయిపోయాను. నా శరీరం ఎంత తేలికైందంటే నన్ను ఒక చిన్న చేసంచిలో పెట్టుకుపోవచ్చు. అలా ఎంత సేపు ఉన్నానో తెలియదు. తర్వాత స్వప్నం అంతరించింది. ఆ తర్వాత ఈ స్వప్నం గుర్తొచ్చినప్పుడంతా నా శరీరం అదే అనుభూతి పొందుతుంది. ఈ స్వప్నంతో శ్రీ మాష్టారు ఆధ్యాత్మిక స్థితి కోల్పోయారు అనే మాట యొక్క ప్రభావం నా నుండి తుడిచిపెట్టుకు పోయింది.

1972 - 75 నాటికే శ్రీ మాష్టారు గారు సర్వవ్యాపకులు సర్వసమర్థులు సర్వజ్ఞులుగా ఉన్నారు. కానీ గృహస్తులు గనుక చాలా గోప్యంగా తన ఆధ్యాత్మిక శక్తి వెల్లడి కాకుండా ఉండేవారు.

గూడురులో ఉండే హరిబాబు గారి దగ్గరకు ఒకరోజొక వ్యక్తి వచ్చి "నీ దగ్గర శ్రీ సాయి లీలామృతం తీసుకుని ఇక్కడే పారాయణ చేయమని" శ్రీ మాష్టారు చెప్పారు అని చెప్పడంతో హరిబాబు సంతోషించి అతనికి ఆ గ్రంథమిచ్చాడు. మొదట బాగానే పారాయణ చేశాడు. అతనిలో కొంత మార్పు వచ్చింది. కానీ ఆ తర్వాత పారాయణ మానేసి తన పాత చరిత్ర చెప్పసాగాడు. అతను నా గదికి వస్తుంటే నాకు భయమేసేది. కొన్నాళ్ళు తరువాత భరించలేక ఒక రోజు "ఏమిటి మాష్టారుగారు ఇలాంటి వాడిని పంపారు. ఇతనిని ఇక మీదట నా దగ్గరకు

రాకుండా చేయలేరా?" అని ప్రార్థించాను. అది సరి ఇక అతను నారూముకే రాలేదు.

ఆ తర్వాత ఒక రోజు నేను మాష్టారు రైల్వేస్టేషనుకు పోతున్నాము. మాష్టారు షడన్‌గా "ఏమయ్యా అతను వస్తున్నాడా?" అని అన్నారు. "అతను" అంటే వెంటనే గుర్తుకురాక కొంచెం ఆలోచించి రావడంలేదు సార్! అన్నాను. సరేలే అన్నారు. గూడూరులో హరిబాబు ప్రార్థించిన ప్రార్థన విద్యానగర్‌లో ఉన్న మాష్టారు విన్నారని, వారి సంకల్పానుసారం అతను హరిబాబు రూముకు రావటం లేదని మనకు తెలుస్తుంది.

శ్రీ మాష్టారు గారు అప్పుడప్పుడు చేసే సూచనలు చాలా చిత్రంగాను భవిష్యత్తులో జరిగే విషయాలు చూచి చెపుతున్నట్లుండేది. ఒకరోజు శ్రీ మాష్టారు అన్నారు "నేను గృహస్తును, దేవరహస్యాలు చెప్పకూడదు. కానీ కొన్ని మీకు చెప్పకపోతే బాధపడుతారు. తెలిసి చెప్పకుండా ఉండలేను సూచన చేస్తాను. వాటిని మీరు పట్టుకుంటే ఇబ్బంది పడకుండా దాటుకుంటారు. పట్టుకోలేకపోతే ఇబ్బంది పడ్తారు" అన్నారు.

అప్పుడు నేను సిప్కో ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాను. శ్రీ మాష్టారు, నేను రైల్లో ఏదో మాట్లాడుకుంటూ వస్తున్నాము. ఉన్నట్లుండీ అప్పటి వరకు మాట్లాడే మాటలకు సంబంధం లేకుండా "నిన్నెవరో ఏదో అంటాడు. నీకు కోపమొచ్చి అతనిని కొడతావు. వాడు మరొక రోజు ఇద్దరిని తీసుకువచ్చి నిన్ను



కొడతాడు. ఆ తర్వాత నీవు నలుగురిని తీసుకువచ్చి అతనిని కొడతావు. తర్వాత జన్మలో అతడు ఎనిమిది మందిని తీసుకువచ్చి నిన్ను కొడతాడు. నీవు తర్వాత జన్మలో పదహారు మంది చేత అతనిని కొట్టిస్తావు. ఆ పై జన్మలో అతడు ముప్పయి రెండు మంది చేత నిన్ను కొట్టిస్తాడు. ఆపై జన్మలో నీవు అరవై నాలుగు మంది చేత అతనిని కొట్టిస్తావు. ఇట్లా ఎన్ని జన్మలు చెన్న బసప్ప వీరభద్రప్పల లాగా" అన్నారు. నిజమే కద సార్ అని తల ఊపాను. నేను నెల్లూరు స్టేషనులో దిగేశాను. మాష్టారు ఒంగోలు వెళ్ళారు.

అటు తర్వాత రెండు రోజులకు సిప్కో ఫ్యాక్టరీలో షిఫ్టు మారి పోయ్యే వాళ్ళు వాళ్ళ డ్యూటీ ప్రకారం ఎయిర్ ప్రెజర్ తో శుబ్రం చేసి పోవాలి. వెళ్ళిపోయే వాళ్ళలో ఒకరిని శుభ్రం చేసి పొమ్మన్నాను. అతను నిష్కారణంగా "ఏమిటి నా కొడకా, పెద్ద భక్తునిలాగ బొట్టు పెట్టుకున్నావు, ఎముకలు విరగ్గొడతాను" అంటూ చండాలంగా బూతులు తిట్టాడు. నా మనసంతా పాడయిపోయింది. డైనింగ్ హాల్‌లో భోంచేసి సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాను. నా స్నేహితుడొకడొచ్చి ఏమి అలా ఉన్నావు అంటూ నిజం చెప్పిందాకా వదల్లేదు. రేపు వాడిని నిన్ను ఎముకలు విరగ్గొటతానన్న తావులోనే వాడి ఎముకలు విరగ్గొట్టాలి అంటూ ప్లాన్ కాయం చేసి పోతున్నాడు. నా మనసులో ఆనాడు రైలులో మాష్టారన్న మాటలన్నీ గుర్తుకు రాసాగాయి. వణుకు వచ్చేసింది. సుదర్శన్ ఇట్లారా అని అతనిని వెనుకకు పిలిచి "రేపు అతనికి వార్నింగ్ ఇచ్చి చూస్తాము. దానిని అతను లెక్క చేయకుంటే

అప్పుడు అతని పని చూస్తామని చెప్పి రేపటి ప్లాన్ విరమింపచేశాను. శ్రీ మాష్టారు తన సూచనను సకాలంలో గుర్తు చేయకుంటే చెన్న బసప్ప, వీరభద్రప్పల కథ నా విషయంలో వాస్తవమయ్యేదే. ఆ ప్రేమ మూర్తి సూచన చేయడమే గాక మరలా సమయానికి గుర్తు చేసి నా ఆపద తప్పించారు.

ఇదే విధంగా శ్రీమతి S. లక్ష్మి గారు ఒక సన్నివేశం చెప్పారు. విద్యానగర్‌లో ఆరోజులలో శ్రీ మాష్టారి ఇంటికి ప్రహరి గోడ లేనందున కాలేజీ విద్యార్థులందరు అడ్డదోవన శ్రీ మాష్టారి గారి బావి ప్రక్కన నడిచి బజారుకు వెళ్ళేవారు. ఒక రోజు శ్రీ మాష్టారు గారు "ఉదయం 8 గం|| లోగా గానీ 10 గం|| పైన గాని బావి దగ్గర నీళ్ళు తోడుకోండి 8-10 గం||ల మధ్య చేదవద్దని చెప్పారు. ఎందుకు అలా చెప్పారో అర్థం గాక శ్రీ మాష్టారి గారి మరదలు అనసూయమ్మ మరికొందరు 8-10 గం||ల మధ్యనే నీళ్ళు చేత్తున్నారు. పోయే విద్యార్థులు వాళ్ళను వ్యంగ్యంగా ఏమో అన్నారు. ఈ ఆడవాళ్ళు ఏమో అన్నారు. ఆ పిల్లలు రెచ్చిపోయి కొట్టబోయారు. వీళ్ళు బావి దగ్గర బిందెలు వదిలేసి ఇంట్లోకి వెళ్ళారు. శ్రీ మాష్టారు ఎందుకు ఆ సూచన చేశారో అప్పుడు వాళ్ళకు అర్థం అయింది.

గూడూరులో ఉండే హరిబాబు గారికి ఒక అధ్యాత్మిక ప్రశ్న గల్గి ఎంత యోచించినా జవాబు దొరకలేదు. రెండు రోజులు తీవ్రంగా యోచిస్తూ రాత్రి నిద్ర కూడా పట్టడం లేదు. ఇక విధి లేక "సార్ మిమ్ములను విద్యానగర్ నుండి గూడూరు



వచ్చి ఈ నాప్రశ్నకు జవాబు చెప్పమనేటంతటి గొప్పవాణ్ణి కాను" కానీ ఈ విషయాన్ని మీతో చర్చించిన వాళ్ళను నా లెవెల్ లో నాకు సమాధానం చెప్పేవాళ్ళను పంపమని రాత్రి 11 గం|| నాలుగైదు సార్లు అనుకొని పడుకొన్నాను. ఒక గంట లోగా టి.డి. కృష్ణమూర్తి వచ్చి తలుపు తట్టి లేపాడు. ఈ టైంలో ఎందుకు వచ్చావు అని అడిగాను. శ్రీ మాష్టారి ఇంటి నుండి మా ఇంటికి వచ్చాను, వెంటనే గూడూరు వెళ్ళాలనిపించి సెంటరుకు వస్తూనే బస్సు చిక్కింది వచ్చాను, అన్నాడు. నా ప్రశ్నకు చక్కని సమాధానం చెప్పి నాసందేహం తీర్చాడు. గూడూరులో ప్రార్థన చేస్తే విద్యానగర్ నుండి శ్రీ మాష్టారు మనిషిని రాత్రి 12 గం|| పంపుతున్నారంటే వారి యోగ స్థితి ఎలాంటిదో చూడండి. కృష్ణమూర్తికి నోటి మాటలతో చెప్పకుండా గూడురులోని నా దగ్గరకు వచ్చేటట్లు ప్రేరేపించారు. ఇన్ని అనుభవాలు ఇస్తున్నా వారి మాట ప్రకారం జీవన భృతి విషయంలో నడుచుకోలేక పోయాను.

"అందరూ వదిలేసినపుడు సద్గురు వొక్కరే చేరదీస్తారు" అని శ్రీ మాష్టారు గురుచరిత్రలో వ్రాస్తారు.

ఒకప్పుడు ఆర్థిక ఇబ్బంది వలన గూడూరులో నాలుగైదురోజులు అన్నం లేక నొక్కి పడి ఉన్నాను. "ఏమిటి సార్ ఈ బ్రతుకు, నెలకు 150 రూ 200 రూ జీతం తెచ్చుకుంటూ హాయిగా ఉండేవాడిని. కష్టమే తెలియకుండా ఉండేవాణ్ణి. నాలుగైదు రోజులు అన్నం లేకుండా ఇలా చేశారే అనుకుంటూ

పడి ఉన్నాను. ఇంతలో ఒక స్నేహితుడొచ్చి నీవు ఎట్లా ఉన్నావో చూసి రమ్మని శ్రీ మాష్టారు విద్యానగర్ నుండి నన్ను పంపారు అని చెప్పాడు. ముఖం కడుక్కొని కడుపునిండా అతని డబ్బుతో టిఫిన్ చేసి విద్యానగర్ వెళ్ళాము. ఆనాటి నుండి ఈ నాటి వరకు శ్రీ మాష్టారి ఆదరణ ప్రేమ వలననే జీవిస్తున్నాను, అంటారు చి|| హరిబాబు. గూడూరులో వీరు అన్నం లేకుండా బాధ పడుతుంటే శ్రీ మాష్టారు హరిబాబుని చూచిరమ్మని మనిషిని పంపడమంటే వారి స్థితి 1975 సం|| నాటికే ఎలాంటిదో చూడండి.

1980 సం|| అనుకుంటాను G. వేణుగోపాల్ అనే విద్యార్థి పాలిటెక్నిక్ చదువుతూ ఆర్థిక ఇబ్బంది వలన అన్నం లేక బాధపడుతున్నాడు. నేను (పి. సుబ్బరామయ్య) శ్రీ మాష్టారి దర్శనానికై మధ్యాహ్నం ఒంటి గంటకు వెళ్ళాను. శ్రీ మాష్టారికి నమస్కరించగానే "వెంటనే గూడూరు వెళ్ళి వేణు ఎలా ఉన్నాడో చూచిరా" అని నన్ను గూడూరు పంపారు. వేణు తన రూములో లేడు. ప్రక్క ఇళ్ళన్నీ చూస్తూ పోతున్నాను. చిత్రంగా ఒక ఇంటి వరండాలో పడుకొనియున్న వేణు ఆసమయంలో వీధి వైపు చూస్తూ సార్! అని నన్ను పలకరించాడు. చూస్తే వేణు చాలా బెట్టపడి కళ్ళు లాక్కు పోయి ఉన్నాయి. ఏమి అన్నం తినలేదా? లేక ఆరోగ్యం బాగా లేదా? అంటే అన్నం తినలేదన్నాడు. నా దగ్గర ఉండే అన్నాన్ని చెరికాస్త తిన్నాము. ఈ విధంగా తనవారు ఎక్కడుండి స్మరించినా వెంటనే ఆదుకొంటుండేవారు. నేటికీ అంతే.



ఈ జి. వేణుగోపాల్ ఒకరోజు రాత్రి వాళ్ళ నాన్నగారితో తగాదా పడ్డాడు. వీరి నాన్న చెప్పే మాట ససేమీరా వినడు. వీరి నాన్నగారి మనసు చాలా బాధ పడింది. అక్కడనుండి వేణుగోపాల్ విద్యానగర్ లోని మాష్టారి దగ్గరకొచ్చి నమస్కరించిన వెంటనే శ్రీ మాష్టారు రాత్రేమి చేశావ్? ఎప్పుడూ అలా చేయకు అంటూ విభూతినిచ్చారు. వేణుగోపాల్ వారి నాన్నతో ఘర్షణ పడింది తలుపూరులో. శ్రీ మాష్టారు అడిగింది విద్యానగర్‌లో. రెండూ గ్రామాల మధ్య దూరం 70 కి.మీ. శ్రీ మాష్టారు సర్వవ్యాపి, సర్వజ్ఞులు కానిదే వారి ఘర్షణ ఎలా తెలుసుకో గలిగారు !

నేనెప్పుడూ గూడా (హరిబాబు) సాయిబాబాను పూజించే వాడిని. మూడు నాలుగు సార్లు శ్రీ మాష్టరు గారి పటానికే పూజ చేశాను. ప్రతిసారి హరికివ్వమని మానాన్న గారి ద్వారా శ్రీ మాష్టారు ప్రసాదం పంపేవారు. ఒక సారి నేను నెల్లూరులో శ్రీ మాష్టారి చిత్ర పటానికి పూజ చేస్తే శ్రీ మాష్టారు ఒంగోలు నుండి జయచంద్రారెడ్డి గారి ద్వారా ప్రసాదంగా దానిమ్మ పండు పంపారు.

శ్రీ మాష్టారు మహాసమాధి చెందాక ఒకసారి శ్రీ మాష్టారి చిత్రపటానికి పూజ చేసి - సార్ మీరున్నప్పుడు మీకు పూజ చేసిన ప్రతిసారి ప్రసాదం పంపారు. ఇప్పుడెలా పంపుతారు? అనుకున్నాను. పూజ చేసుకుని విద్యానగర్ వెళ్ళగానే అక్కడ శేషాద్రి కనిపించి శ్రీ మాష్టారి ఫోటోలు ఇచ్చారు. మహాసమాధి

అనంతరం కూడా శ్రీ మాష్టారు మనందరినీ కంటికి రెప్పవలె కాపాడుతున్నారు.

గూడూరులో ఒక స్నేహితుడు - శ్రీ సత్య సాయి షిరిడీ సాయి అవతారమా?" అని శ్రీ మాష్టారు ప్రచురించిన వ్యాసం గల సాయిబాబా పక్షపత్రికలు వెతికి ఇమ్మని హరిబాబు గారిని అడిగారు. వాటిని వెతకలేక ఇవ్వలేదు. మరురోజు కాళహస్తి నుండి ముగ్గురు వ్యక్తులు వచ్చి శ్రీ సత్య సాయి షిరిడీ సాయి అవతారమా? అనే శ్రీ మాష్టారి వ్యాసం జెరాక్సు కాపీలు హరిబాబు గారికిచ్చారు. వాటిని ఆ స్నేహితునికిచ్చాడు. శ్రీ మాష్టారు మహాసమాధి అనంతరం కూడా సర్వత్రా అందరినీ గమనిస్తూ మనం బద్ధకించినా వారు తన ప్రచార కార్యాన్ని మరొకరి ద్వారా చేయించుకుంటున్నారని తెలుస్తుంది.

నా పేరు M.S.V. Subba Rao. నాకు సాయి మాష్టారుతో పరిచయం లేదు, కాని నా ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీప్రభ ద్వారా వివాహానంతరం కొంత ఆయన గూర్చి తెలిసికొనుట జరిగినది.

సాధారణంగా అప్పుడప్పుడు నాకు ధ్యానం చేయడం అలవాటు. ఒక రోజు (తేది 28-11-2003) ధ్యానము చేసికొనుచుండగా, మా యింటిలో నున్న సాయి మాష్టార్ (భరద్వాజ) గారి Black & White Laminated Photo నా కనుల ఎదుట సాక్షాత్కరించింది. తదేకంగా ధ్యానం



చేసికొనుచుండగా సాయి మాష్టర్ గారిలో అంతర్లీనంగా ఉన్న షిర్డిసాయిబాబా గారు సాక్షాత్కరించారు. మాష్టారు గారు, బాబాగారు తర్వాత మరలా మాష్టరు గారు తరచుగా మారుతూ కనిపించడం జరిగినది. దీనిని బట్టి షిర్డి సాయి బాబాగారే ఎక్కిరాల భరద్వాజ గారిలా మరల జన్మించి గురు తత్వమును ధృడపరచుటకు అవతరించినారని తెలియుచున్నది. గనుక సాయినాధునికి శ్రీ మాష్టరు గారికి భేదము లేదు. విశ్వ చైతన్యమే అలా మన కొరకు భాసిస్తుంది.

M.S.V. Subba Rao,
Hyderabad.

## హరిబాబు ఇలా చెబుతున్నారు:

మదనపల్లిలో ఒక యువకుడు శ్రీ మాష్టారి రచనలన్నీ చదివి వాటి విశిష్టతను ప్రింట్ చేసి పంచుతున్నాడు. అతనితో కొంతసేపు మాట్లాడాక ఆయన శ్రీ సత్యసాయిని గురించి మీ అభిప్రాయమేమిటని అడిగాడు. ఆ విషయం కొంత సేపు మాట్లాడుకున్నాము. శ్రీ మాష్టరు గారు ఇదివరలో శ్రీ సత్య సాయి షిరిడీ సాయి అవతారమా? అనే వ్యాసం ప్రచురించారు. దాన్ని జెరాక్స్ తీసి ఇతనికి పంపితే బాగుండుననుకొన్నాను. కానీ పంపుతానని చెప్పలేదు. శ్రీ మాష్టారు ఫోటో పంపుతానన్నాను. సకల సాధు స్వరూపి సాయి అని మాత్రం చెప్పి విడిపోయాము.

ఈ మదనపల్లె యువకుడు ఒంగోలు నుండి పుస్తకాలు తెప్పించుకుంటే ఆ పుస్తకాల ప్యాకింగులో సత్య సాయి షిరిడీ సాయి అవతారమా? అనే మాష్టరుగారి వ్యాసం ప్రింటయిన పత్రిక కూడా ఉన్నాయట. ఆ యువకుడు హరిబాబుకు ఈ విషయం లెటర్ వ్రాస్తూ శ్రీ మాష్టారు మనం మాట్లాడే ప్రతి మాటా వింటున్నారు చేసే ప్రతి పని చూస్తున్నారు. మన ఆలోచనలన్నీ గమనిస్తున్నారు అని వ్రాశారు. ఇది పరమ సత్యం గదా!

## ఉద్యమానికి సరిపడే మనిషి

తపశ్శక్తి వల్ల చాలా ప్రశాంత వాతావరణం ఏర్పడుతుంది. గలాటాలు లాంటివి ఉండవంటారు కదా, మరి విద్యానగర్‌లో ఇలా రచ్చలు రావిళ్ళు ఏంటి సార్ అంటే శ్రీ మాష్టారు అన్నారు, "నారాయణ మహరాజ్ చెప్పారుగదా, బ్రహ్మరాక్షసులు నివసించిన ప్రదేశమిది" అని. మన తపశ్శక్తి వల్ల అది బయటకొస్తుంది. ఇట్లా అయిన తర్వాత ప్రశాంత వాతావరణం నెలకొంటుంది.

నా ఉద్యమానికి సరిపడ్డ మనిషి దొరకలేదు అప్పుడు ఇంతకంటే ఘోరంగా ఉండేది. అపుడు ఈ రూపంతోనే తిరగడమంటూ ఉండదు. ఉదయం 7½ గం|| గాంధి బొమ్మ సెంటరులో ఉంటానురా అంటే 7½ కు ఖచ్చితంగా వస్తేనే నేనక్కడ ఉంటాను నీక్కనిపిస్తాను. 7.32 కు గానీ 7.35 కు



గానీ వస్తే నేను ప్రక్కనే ఉంటాను, నీవు కనుక్కోలేవు అన్నారు. కానీ మేమెవ్వరమూ వారికి సహకరించలేక పోయాము. వారి యోగ శక్తిలెలాంటివో మనమే ఊహించుకోవాలి.

## శ్రీశైలం పూర్ణానంద స్వామి వారు శ్రీ మాష్టారిని ప్రశంసించడం

విద్యానగర్ శంకుస్థాపనకు వచ్చినప్పుడు శ్రీ పూర్ణానంద స్వామి వారు హరిబాబుతో అన్నారు - బాబు నాకో చిన్న పని చేసి పెట్టగలవా? విద్యానగర్ వైపు తిరిగి చేతులు జోడించి దండం పెట్టి "మీ భరద్వాజ బాబాకు నా నమస్కారాలు చెప్పు. మీ మాష్టారు గారి దగ్గరుండే శిష్యులు నా దగ్గరుంటే నేను ఎప్పుడో పుంజాలు తెంచుకొని పారిపోయి ఉండేవాడిని" అన్నారు. ఈ విషయం మాష్టారికి చెపితే "ఇట్లా పట్టుకొని ఉంటే ఆగిఉన్నారు మీరు లేకపోతే సామాన్యులా" అన్నారు.

## శ్రీ మాష్టారి మహా సమాధి అనంతరం వారితో నా అనుభవాలు (ఏ. సుబ్బరామయ్య)

పాపమేది? పుణ్యమేది? అనేందుకు నిర్వచనం మహాత్ముల ద్వారా కానీ ఉపనిషత్తులు, భగవద్గీతలో గానీ కావాలని శ్రీ రామకృష్ణ మఠం మైలాపూర్, ఏర్పేడు వ్యాసాశ్రమం మరియు అనేకులు నా మిత్రులను నెలల తరబడి అడిగినా

సమాధానం లేదు. ఇక లాభం లేదని శ్రీ మాష్టారి చిత్రపటానికి విన్నవించుకొని నా సమస్య తీర్చమని విన్నవించాను. మూడవ రోజు ఉదయాన్నే ఎప్పుడూ రేడియో పెట్టని నేను రేడియో ఆన్ చేశాను. సూక్తి ముక్తావళి వస్తుంది - వేమన పద్యం చదివి అర్థం చెపుతున్నాడు. "ఏ జీవికి ఉపకారం చేసినా పుణ్యమే. ఏ జీవికి అపకారం చేసినా పాపమే." ఎక్కడ గొలగమూడి ఎక్కడ విజయవాడ, ఇక్కడ నా విన్నపానికి విజయవాడలో ప్రేరేపించి చెప్పించి అదే సమయంలో నన్ను ప్రేరేపించి రేడియో ఆన్ చేయించి వినిపించిన కరుణామయుడు శ్రీ మాష్టరు గారు.

మరొకసారి దైవీ హ్యేషాగుణమయీ...... అనే భగవద్గీత శ్లోకం యొక్క అన్వయం విషయంలో తల పిచ్చెత్తింది. అందులో దైవీ సంబంధమైన నా మాయ దాట శక్యము కానిది. నన్నే శరణు పొందిన ఆ మాయను దాటగలవు అంటారు అందులో. మాయ మనలను ఆవరించి యుండగా మనము భగవంతుని శరణుపొందగలమా? పెండ్లయితే పిచ్చి కుదురుతుంది. పిచ్చి కుదిరితే పెండ్లి అవుతుంది అన్నట్లుంది ఈ సమస్య. మరలా అందరినీ అడిగి వేసారిపోయాను. చివరకు శ్రీ మాష్టారినే అడిగాను. అడిగిన మరుక్షణం నుండి "జ్ఞానేశ్వరి భగవద్గీత చూడు" అని హృదయంలో చెప్పసాగారు. అందరూ నాలుగు లైన్లు వ్రాస్తే వారు నాలుగు పేజీల వివరణ వ్రాశారు. చివరి పేజీలో - సద్గురిని ఆశ్రయించాక మాయ మనలనేమీ చేయజాలదు అని చెప్పారు. సద్గురుని ఆశ్రయించి



ఏమి చేయాలి ఎలా చేయాలి అని చెప్పారు. ఈ విధంగా శ్రీ మాష్టారు నేటికీ పిలవగానే పలుకుతున్నారు.

ఒక రోజు సార్ నిత్యం చక్కెర తిని పోతారు గానీ, ఒక్క మాట గూడ చెప్పరు. ఈ రోజు ఏదైనా సందేశమివ్వండి అని ప్రార్థించి ఈ పుస్తకంలో పుల్ల పెడతాను. ఎడమ వైపు మొదట లైనులోనే మీ సందేశముండాలి అని పుల్లతో తెరిచాను. "ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకో, లేకుంటే బూడిదై రాలిపోతావు" అని ఉంది. ఎంత గొప్ప సందేశమో చూడండి.

ఆ మరుసటి రోజు "నిన్న చాలా కమ్మని చెంపదెబ్బ కొట్టారు. ఈరోజు రెండవ చెంపదెబ్బ కొట్టండి. అని మరలా పుల్లతో పుస్తకం తెరిచాను. "మాయ ఎవ్వరినీ తనంత తానుగా తననతిక్రమించనివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నంతో మాయను అతిక్రమించు" అని వచ్చింది. ప్రత్యేక ప్రయత్న మంటే ఏమిటో ఒకసారి మాష్టారు చెప్పారు. భూమినుండి ఒక రాకెట్టు చంద్ర మండలం పోవాలంటే భూమ్యాకర్షణ రేంజ్ - స్పేస్ - చంద్రా కర్షణ రేంజ్‌లలో ప్రయాణం చేయాలి. భూమినుండి స్పేస్ వరకు వెళ్ళేందుకు ఎంత ఇంధనం పడుతుందో కేవలం స్పేస్‌లో ప్రవేశించేందుకు అంత ఇంధనం పడుతుంది. ప్రత్యేక ప్రయత్నం అంటే అంతగా చేయాలని అర్థం.

ఒక సంవత్సరం తర్వాత మరలా వారి సందేశం అడిగాను. ఇప్పుడు మానవులు దూరలేని మామిళ్ళకోన అనే

బిలంలోకి శ్రీ వెంకయ్యస్వామి వారు వారి వెనకాల అక్కిం వెంకట రామిరెడ్డి గారు పోతున్న వర్ణన వచ్చింది. దాని అర్ధమేమిటో తెలియక చాలా ఆలోచించాను. చివరకు వారే తోపింపచేశారు. ఆ బిలంలోకి మానవులు ప్రవేశించలేనంత ఇరుకైనది. కానీ శ్రీస్వామి వారికి ఆ బిల ద్వారం చక్కగా తెరుచుకొని పోసిచ్చింది. శ్రీస్వామిని వెంబడించినందున అక్కిం వెంకటరామిరెడ్డి గారు కూడా బిలంలో ప్రవేశించారు. ముక్తి ద్వారంలో మానవులు ప్రవేశించలేరు. శ్రీస్వామి వారిని అనుసరిస్తే సులభంగా ప్రవేశించ గలరు అని తెలుసుకున్నాను. శ్రీస్వామి వారిని అనుసరించడమంటే ఏమిటీ ?

శ్రీస్వామి వారు సిద్దపురుషులు. వారికి సాధన, నియమము అక్కరలేదు. కానీ మనకు ఆచరణ ద్వారా బోధించేందుకు కఠోరనియమపాలనలు చేశారు. నిష్కామ కర్మ బోధించేందుకు అందరి బాధలు తన శరీరం మీదకు తీసుకుని అనుభవిస్తూ - రాత్రింబవళ్ళు అగ్ని హోత్రం ముందు కూర్చుని ఆ కర్మ దోషాలను హరించారు. గనుక కఠోరనియమపాలన, నిష్కామకర్మ, వైరాగ్యము, త్యాగము వారిని చూచి మనం నేర్చుకోవాలని శ్రీమాష్టారు చెపుతున్నారు.

శ్రీ మాష్టారి మహాసమాధి అనంతరం 2003 వ సం||లో గొలగమూడిలోని శ్రీసాయి మాష్టార్ నిలయము పైన అంతస్థు వేయాలనే సంకల్పం అప్పటికప్పుడు కల్గించారు. శ్రీ స్వామి వారి దగ్గర చీట్లు వేస్తే కట్టమన్నారు. కడుతుంటే కల్గే ఒడిదుడుకులు,



ఆర్థిక ఇబ్బందులూ అన్నీ శ్రీ మాష్టారే పరిష్కరించి పనిపూర్తి చేయించారు. శ్రీ వెంకయ్య స్వామివారి ఆరాధన రోజున ప్రారంభోత్సవం, శ్రీ మాష్టారి పటం పెట్టి భజన చేయాలను కున్నాను. కానీ ఎవ్వరి పిలుపు లేకుండానే దమ్మపేట, ఖమ్మం జిల్లా నుండి నాగమణి అనేవారు గిన్నెలు సామానుతో సహా తెచ్చి అన్నదానం కూడా రెండు రోజులు చేశారు. శ్రీ మాష్టారే అన్నికార్యాలు చేస్తుంటే మనం చేస్తున్నామని ఆత్మలోనైనా తలవడం ఎంతో అవివేకం. బంధహేతువుగదా !

ఒకసారి శ్రీ మాష్టారు Ch.శ్రీనివాసులు రెడ్డి గారిని నీవు కాళహస్తి గోపాలస్వామివారి దగ్గర 2 గం|| సేపు ఉండి వారు చెప్పినదల్లా చేసి రమ్మన్నారు. వచ్చి శ్రీ మాష్టారికి నమస్కరించగానే ఐదు రోజులిక్కడ ఉండమన్నారు. ఏమిటి వీరిలా చెపుతున్నారని ఆలోచిస్తున్నాడు. అంతలో విపరీతమైన వర్షం ఐదురోజులు కురిసినందున వారు మెట్టు గ్రామం పోలేక విద్యానగర్ లోనే ఉండవలసి వచ్చింది. దీనిని బట్టి శ్రీ మాష్టారికి భవిష్యత్తు ఎంత చక్కగా తెలునో తెలుస్తుంది. సూచన చేస్తారు కానీ వివరాలు చెప్పరు. గృహస్తు గనుక చెప్పరు. సాయి కూడా వివరాలు చెప్పేది లేదు కదా.

## శ్రీమతి S.లక్ష్మి గారి అనుభవాలు:

సాయిబాబా ది మాష్టర్ - ఇంగ్లీషు పుస్తకాన్ని తమిళంలోకి తర్జుమా చేయమన్నారు. నేను విద్యానగర్‌లో

శ్రీ మాష్టారి ఇంట్లో ఉంటూ ఆ పని చేస్తున్నాను. మాచెల్లెలికి నిశ్చితార్థమని నన్ను రమ్మని లెటర్ వచ్చింది. శ్రీ మాష్టారి నడిగితే "సరి" అన్నారు. వెంటనే నాకు నడుంనొప్పి వచ్చింది. ఎంత పెద్ద బాధంటే వంగి శ్రీ మాష్టారికి నమస్కరించలేకుండా ఉన్నాను. శ్రీ మాష్టారు చెప్పిన పనిచేయకుండా పోతాననబట్టే ఈ నొప్పి వచ్చిందని గట్టిగా అనిపించి - మాష్టారూ నేను వెళ్ళడం లేదు అని చెప్పాను. ఎంతో ఆశ్చర్యంగా వెంటనే నొప్పి తగ్గిపోయింది. శ్రీ మాష్టారు నన్ను దీక్ష స్థితిలో ఉంచి వ్రాయిస్తుంటే ఆ దీక్షకు ఆటంకం రాకుండా అలా చేశారని నేను తలచాను. పుస్తకమంతా చదివితే తర్జుమా అంతచక్కగా వచ్చినందుకు నాకే ఆశ్చర్యమేసింది. నిజానికి అది తర్జుమా చేసింది శ్రీ మాష్టారే. నేనొక పనిముట్టును మాత్రమే అని అనుకున్నాను.

తర్జుమా అయ్యాక సాయిబాబా ది మాష్టార్ ఇంగ్లీషు సెకండ్ ఎడిషన్‌కు మార్పులు చేసిన ప్రతిని నాకొకటి ఇచ్చారు. అందులో పేజీకి ఐదు ఆరు వాక్యాలు సవరణలున్నాయి. అది మూడువందల పేజీల పుస్తకం, అంటే 1800 వాక్యాలు వ్రాయాలి. ఈ సవరణలన్నీ తమిళ్ గ్రంథములో మార్పుచేసి ప్రింట్ చేయమన్నారు.

కానీ నాకు పనిచేయాలనే బుద్దేలేదు. సవరణలు చేయకుండా అలాగే కూర్చుంటూ కాలం వ్యర్థం చేస్తున్నాను. ఒక రోజు "మాష్టారూ! నాకు పనిచేసే బుద్దే పుట్టడం లేదండీ"



అన్నాను. ఆ మాట వారు విన్నారో లేదో తెలియదు. నాకు అకస్మాత్తుగా ఏడుపొచ్చి ఆపుకోలేక బాత్ రూంలోకి వెళ్ళి చాలాసేపు ఎక్కి ఎక్కి ఏడ్చి, ఆ ఏడ్పు ఆగినాక ముఖం కడుక్కొని వచ్చి కూర్చొని వ్రాయసాగాను. ఉదయం 10½ గం|| నుండి రాత్రి 8½ గం|| కు పుస్తకమంతా పూర్తిచేయడం నాకే చాలా ఆశ్చర్యమేసింది. బోర్, అలసట లేకుండా యోగస్థ:కురుకర్మాణి అన్నట్లు ఎంతో హాయిగా ఆ పని ఒక్క రోజులోనే నాచేత చేయించిన మహనీయుడు వారు.

ఒకసారి శ్రీ మాష్టారు నన్ను టీ, కాఫీలు మానెయ్య మన్నారు, వెంటనే మానేశాను. కానీ కొన్ని నెలలు తర్వాత మరలా త్రాగడం మొదలు పెట్టాను. శ్రీ మాష్టారు సమాధి చెందిన ఐదు సంవత్సరాలకు శ్రీ మాష్టారి చిత్రపటంముందు కూర్చొని - ఇల్లు, వాకిలీ, బంధువులను వదులుకొని వచ్చి నేనేమి సాధించాను. మీరు కాఫీ, టీ లు మానమంటే ఇప్పటికీ మానలేకుండా ఉన్నాను. మీరు మా మధ్య ఉన్నప్పుడు మీకు చెప్పుకోలేదు. మాష్టారండీ! "కాఫీ, టీలు వదలడం నావల్ల కాలేదు. మీ అనుగ్రహముంటే వదలగలనేమో" అని చెప్పుకొన్నాను. అంతే ఆ రోజు నుంచి మరల కాఫీ, టీ లు పూర్తిగా మానగలిగాను. శ్రీ మాష్టారికి మన తప్పులు చెప్పుకుంటే ఎంత చక్కగా మన ప్రవర్తన సరిచేస్తారో చూడండి.

శ్రీ మాష్టారు ఒంగోలులో పెట్టిన సాయిబాబా సెంట్రల్ స్కూలులో నన్ను ప్రిన్సిపాల్‌గా వేశారు. సాయంకాలం వరకు

చిన్నపిల్లలతో వేగి అలసట వచ్చి ఫ్రెస్ ప్రక్కనున్న నా రూముకొచ్చి పడిపోయేదాన్ని, రోజుకొక్క సారైనా శ్రీ మాష్టారికి నమస్కరించకుంటే ఎలాగని చిన్నగా లేచి మాష్టారింటికి వెళ్ళి వారి పాదాలకు పుష్పాలర్పించి నమస్కరించుకొనే దాన్ని. అప్పుడు అమ్మగారు నడవలేక మంచంలో ఉన్నారు.

ఇంట్లో ఎన్నో పనులున్నాయి. ఈ ఒక్క పనిచేసి పోదాం. ఈ ఒక్క పనిచేసి పోదాం అనుకుంటూనే ఇంట్లో పనులన్నీ చేసి మంచాలు పరచి రాత్రి 11 గం|| లకు ఏ అలసట లేకుండా ఫ్రెష్‌గా నా రూముకొచ్చేదాన్ని. బాగా అలసిపోయిన నాచేత రాత్రి 11 గం|| వరకు అలసట లేకుండా సంతోషంగా పనిచేయించింది ఆ మహనీయుని యోగశక్తే.

1987 లో నేను శ్రీ మాష్టారి ఆదేశం ప్రకారం ఒక సంవత్సరం బాంబేలో ఉన్నాను. అక్కడ కంప్యూటర్ కోర్సు చేస్తున్నాను. శ్రీ మాష్టారి బర్త్‌డే వస్తుంది. పోవాలని ఉబలాటం. బాబాను ప్రార్ధించాను. అందరూ అంగీకరించి పంపారు. రైల్లో కళ్ళుమూసుకొని ధ్యానం చేస్తున్నాను. నాముందు అల్లామాలిక్, అల్లామాలిక్ అని వినిపిస్తుంటే కళ్ళు తెరిచాను. నిజంగానే సాయిబాబా వేషంలో ఒకరు దక్షిణ అడుగుతున్నారు. దక్షిణ ఇచ్చి కళ్ళు మూశాను. మరలా ఆ కంపార్టుమెంటులో అతని జాడేలేదు. ఒంగోలు రాగానే మాష్టారు అల్లామాలిక్, అల్లామాలిక్ అని ముమ్మారు పలికారు. ట్రెయిన్ లో దక్షిణ కోరింది కూడా వారే. వారు సర్వవ్యాపకులని తెలుస్తుందిగదా!



శ్రీ మాష్టారు మహా సమాదిచెందిన మరుసటి రోజు కరుణామయుడైన శ్రీ మాష్టారు నాకొక దివ్యానుభవం ఇచ్చారు. దాని ద్వారా నేను నిత్య సత్యుడను అని నాకు బోధించారు. శ్రీ మాష్టారికి కాఫీ ఇద్దామని నాకెవరో గుర్తు చేశారు. నేను కాఫీ కప్పు తీసుకొని శ్రీ మాష్టారి పటం ముందు పెట్టబోయాను. నాచేతిలోని కాఫీ కప్పు ఎవరో అదృశ్యంగా లాక్కున్నట్లు అనుభవమైంది.

ఒకసారి ఉమా అయ్యర్ వాళ్ళంతా అహోబిలం పోతూ నన్నూ తీసుకు వెళ్ళారు. అహోబిలంలో ఒకకొండ పైన దేవాలయం ఉంది. కొండ ఎక్కిపోవాలి. నాకు మోకాళ్ళు నొప్పులుండడంతో నేను రాలేను, మీరంతా వెళ్ళిరండి నేనిక్కడనే కూర్చొనుంటానని చెప్పి వారిని పంపేశాను. మరుక్షణమే ఒక అదృశ్య హస్తం నాజబ్బ పట్టుకొని లేపి కొండ మెట్ల మీద నడిపిస్తుంది. నేను మారుమాట్లాడకుండా మెట్లెక్కుతున్నాను. ఇక రెండు మెట్లుండగా ఇక పో అన్నట్లుగా నన్ను ముందుకు నెట్టి నా జబ్బ వదిలేసింది. నాకు మోకాళ్ళు నొప్పులే లేవు. సంతోషంగా కొండ దిగి వచ్చాను. అలా నన్ను నడిపించింది శ్రీ మాష్టారు గాక మరెవరుంటారు. పై అనుభవాల ద్వారా వారు నిత్య సత్యులు సర్వాంతర్యామి, సర్వజ్ఞులు, సర్వ సమర్ధులని ఒక సద్గురువుకుండవలసిన లక్షణాలన్నీ నిరూపిస్తున్నారు. సంపూర్ణ హృదయంతో వారికి సంపూర్ణ శరణాగతి చేస్తే మనం గమ్యం చేరడం తధ్యం.

శ్రీ M.V. శ్రీనివాసరావు 48-1-34 మరాఠి పాళెం ఒంగోలు వారు తన దివ్యానుభవం ఇలా వ్రాస్తున్నారు. 1996 సం||నుండి శ్రీ సాయిబాబా గుడికి వెళుతుంటాను. సత్ సంగానికి ఆరునెలలు నియమంగా వెళ్ళేవాడిని. నాకు సిగరెట్ త్రాగడం అలవాటు. నా సంపాదన అంతా నా పైన స్మోకింగ్ కే సరిపోయేది. డాక్టర్లు, మిత్రులు, ఇంట్లో వాళ్ళు అందరూ త్రాగవద్దన్నా ఆపలేకున్నాను. ఆరోగ్యం బాగాలేదు. ఒకరోజు శ్రీ మాష్టారి సమాధి దర్శనానికి వెళ్ళాను. సమాధి నుండి శ్రీ మాష్టారు బయటికి వచ్చి కూర్చున్నారు. "ఆరోగ్యం బాగా లేదు కదా? సిగరెట్లు మానెయ్. మానెయ్యమని చెపుతున్నాను కదా" అన్నారు. అదృశ్యమైనారు.

వారలా చెప్పినాగాని మందిర ఆవరణ దాటి బయటకు వచ్చి కాల్చడానికి సిగరెట్ తీయగానే అలర్జీలాగ వచ్చి వికారంగా వాంతి అయ్యేటట్లు అయింది. ఆ సిగరెట్ పారేసి మరొక సిగరెట్ తీసినాగానీ అలాగే అయింది. ఇక ఆ తరువాత నుండి ఎన్నడూ త్రాగడం లేదు.

మరొకరోజు శ్రీ మాష్టారు సమాది చెందినపుడు జరిగిన గ్రామోత్సవమంతా నా స్వప్నంలో దర్శనమయ్యాయి. ఆనాడు నేను గ్రామోత్సవం చూడలేదు. గనుక భక్తులను విచారిస్తే సరిగ్గా అలాగే జరిగిందని చెప్పారు. నా దురభ్యాసాన్ని శాశ్వతంగా నిర్మూలించి నా ఆరోగ్య, ఆర్థిక పరిస్థితి చక్కబెట్టిన శ్రీ మాష్టారికి నేనేమి చేసినా ఋణం తీర్చుకోలేను.



## ఒంగోలు భక్తుల అనుభవాలు

లాయరుపేట శ్రీ సాయిబాబా మందిర ట్రెజరర్ గారు శ్రీ రమణా రెడ్డి గారిలా వివరిస్తున్నారు.

వేల రూపాయలు చేసే పురుగుమందుల డబ్బాలు మాషాపులో ఉండేవి. ఆ షాపు పెంకుటిండ్లలో ఉంది. రెండిండ్ల మధ్య ఉండే దోనె రేకు కత్తిరించి ఒక దొంగ రెండుమార్లు పురుగుమందుల డబ్బాలు వేల రూపాయల విలువ చేసేవి దొంగిలించాడు. వేల రూపాయల పురుగు మందుల డబ్బాలు పోతుంటే ఏమి చేయాలో తెలియక నా బాధను శ్రీ మాష్టారికి చెప్పుకున్నాను. ఆ మహనీయుడు చిటికెడు విభూతి పొట్లం గట్టించి ఆ షాపులో చల్లమన్నారు. అలా చేశాక ఆ దొంగే కాదు ఇక ఏ దొంగ రాలేదు.

ఒక రోజు మా మిద్దె ఇంట్లోకి ఒక నాగు పాము వచ్చింది. ఇంట్లో వాండ్లందరూ భయభ్రాంతులై బయటకు పరిగెత్తారు. దానిని చంపాలని కొందరు యానాదులు ఇంట్లోని ప్రతి చిన్న వస్తువుతో సహా తొలగించి చూచారు. పాము ఎక్కడా లేదు. ఇంట్లోకి పొయ్యేందుకు ఎవ్వరూ సాహసించలేదు. నేను శ్రీ మాష్టారికి చెప్పుకుంటే చిటికెడు విభూతి ఇచ్చి ఇంట్లో నాలుగు మూలలా చల్లమన్నారు. అలా చేయగానే ఆ పాము మరలా ఎవ్వరికీ కనిపించలేదు. ఆ కరుణామూర్తికి ఆజన్మాంతము ఋణపడియున్నాను.

## ఒంగోలులోని శ్రీ మాష్టారి గారి గృహ నిర్మాణంలో ముఖ్యపాత్ర వహించిన శ్రీ కొత్తూరి రాధాకృష్ణమూర్తి గారి అనుభవం:

నేను మెదటిసారి శ్రీ మాష్టారిని సంతపేటలో బాడుగ ఇంటిలో ఉండగా దర్శించడం జరిగింది. నేను చూచే సమయానికి ఒక గళ్ళ లుంగీ, కోరా బనీను ధరించి, ముఖాన గడ్డం, మెడలో తాయెత్తు, ఒక చేతిలో కాఫీ గ్లాసు, మరొక చేతిలో సిగరెట్టుతో దర్శనమిచ్చారు. మరుక్షణం నా మనసులో - ఏం గురువులు - చేతిలో కాల్చిన సిగరెట్టు, అదే చేత్తో ఊదీ ఇవ్వటం అని తలచాను. అయినా మనం వచ్చిపోయే వాళ్ళమేగదా. మనకెందుకులే అనుకున్నాను. నా స్నేహితుడు U.L.రాంప్రసాద్‌తో పాటు నమస్కరించి శ్రీ మాష్టారిచ్చిన రెండరటి పండ్లు తీసుకుని వెళ్ళిపోయాను.

ఒకప్పుడు నేను తయారు చేయించిన వస్తువులను మార్కెట్టులో అమ్మేందుకు రెప్రజెంటేటివ్‌లకు ఇస్తే వాళ్ళు ఒకటి రెండుసార్లు నమ్మకంగా ఉండి ఆ తర్వాత, సామాను తీసుకెళ్ళిన ఒక్క రెప్రజెంటేటివ్ కూడ కనిపించక నాలుగు లక్షలు నష్టపోయాను. నేను తెలివి తక్కువ వాడినా? ఇంత నష్టపోయానే అనే నిరంతర ఆలోచన వల్ల బి.పి. పెరిగి నిద్రపట్టక చాలా బాధపడుతున్నాను. బి.పి. మాత్రలు, నిద్ర మాత్రలు వేసుకున్నా నిద్ర పట్టనందున ఇంట్లో అందరూ ఆందోళనలో ఉన్నారు.



ఈ విధంగా నేను బాగా అనారోగ్యంగా ఉండేటప్పుడు నా స్నేహితుడు మరలా మాష్టారి దగ్గరకు తీసుకు వెళ్ళాడు. ఈ బాబాలు, గురువులమీద నాకు నమ్మకం లేనందున రానన్నాను. కానీ బలవంతంగా తీసుకెళ్ళాడు. నేను బయట నిలుచుని ఉన్నాను. నా మిత్రునికి శ్రీ మాష్టారికి నమస్కారం చేసుకునే అలవాటు. ఆతడు లోపలకు వెళ్ళాడు. అంతా నా కథే మాష్టారు చెపుతున్నట్లు నాకు వినిపిస్తుంది. శ్రద్ధగా వింటున్నాను. నా మిత్రుడు వచ్చి పోదాం రమ్మంటే నేను పోకుండా మాష్టారి దగ్గర కూర్చున్నాను. సాయంత్రం వరకు అక్కడ కూర్చొని ఇంటికి వచ్చాను. అదేమిచిత్రమో కానీ ఆనాటి రాత్రికి నిద్రమాత్రలు వేసుకోకుండానే చాలా ఘాడంగా తెల్లవార్దులూ నిద్ర పోయాను. ఇది ఇంట్లో వాళ్ళందరికీ చాలా ఆశ్చర్యంగాతోచి తెల్లవారి నుండి నన్ను శ్రీ మాష్టారి సన్నిధికి పంపసాగారు. అది మొదలు నా నిద్ర మాత్రలు, ఆలోచనలు అన్నీ ఏమయ్యాయోగానీ హాయిగా నిద్ర పోతూ ఎంతో హుషారుగా ఉంటున్నాను. ఈ విధంగా ఒక్క సంవత్సరమైనా ఏమయ్యా నీవు రోజూ వస్తున్నావు, నీ వెవరు, నీ పరిస్థితి ఏమిటని శ్రీ మాష్టారు అడుగలేదు. నేను నా విషయం నా వ్యాపారంలో నష్టం గురించి, నా ఆరోగ్య పరిస్థితి గురించి న్నాకై నేను వారికి చెప్పలేదు.

సంవత్సరం తర్వాత శ్రీ మాష్టారే అడిగితే నేను చెప్పాను. అయ్యో! దాని కొరకు సాయి సేవ మానుతామా. నీవు బాగా వాసన ఉండేటట్లు సాంబ్రాణి కడ్డీలు తయారు చేసి - ప్యాకింగ్ అటా టోపం లేకుండా సాయిబత్తీ అని చిన్న లేబిల్ కడ్డీల

కట్టమీద కట్టి లాభాలు లేకుండా విక్రయిస్తుండు, అందరూ మీ ఇంటికి వచ్చి కొనుక్కుపోతారు, అని చెప్పారు. అలా చేస్తుంటే విపరీతమైన అమ్మకాలు జరిగేవి.

శ్రీ మాష్టారు నన్ను సాయి చరిత్ర పారాయణ చేయమన్నారు. సార్! నన్ను బాబా షిరిడీకి తీసుకుపోతే పారాయణ చేస్తానన్నాను. ఇది రివర్స్‌గా ఉందే! అందరూ పారాయణ చేసి షిరిడీ తీసుకవెమ్మని ప్రార్థిస్తారు. నీవు దానికి వ్యతిరేకంగా చెపుతున్నావు. సరే చూస్తాం, అన్నారు. తెల్లవారే కర్నూలు రోడ్డులోని సాయిబాబా మందిరం వారు పాదుకలు తెచ్చి షిరిడీలో సమాధికి తాకించి తెప్పించమని శ్రీ మాష్టారిని కోరారు. శ్రీ మాష్టారు ఆ పని నాకు వప్పగించారు. నేను షిరిడీలో బస్సుదిగి నా మిత్రుడు లక్ష్మీనారాయణగారి సిరస్సున పాదుక లుంచి శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై అని అనగానే ఎందరో యాత్రికులు లక్ష్మీనారాయణగారికి కుంకుమతో నామం పెట్టి కర్పూరం వెలిగించి భజనతో శ్రీ సాయి సమాధి మందిరానికి పాదుకలు తీసుకవెళ్ళారు. సమాధి మందిర పూజారులకు ఈ విధంగా పాదుకలు వస్తున్నాయని తెలిసి వారు కర్పూరం వెలిగించి టెంకాయ కొట్టి పాదుకలకు స్వాగతం పలికి లోపలకు తీసుక వెళ్ళి మూడురోజులు ఉంచుకొని మరలా అదే వీడ్కోలు సన్నాహాలు కర్పూరం టెంకాయ కొట్టడంతో పాదుకలను సాగనంపారు. అది మొదలు నేను పారాయణ చేయమొదలు పెట్టాను. నా వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా అభివృద్ధి కాసాగింది. కడ్డీలు, ఫెనాయిలు, ఇంకు, డిటర్జెంట్ సబ్బులు తయారుచేయసాగాను. ఆనందంగా కాలం గడుస్తుంది.



శ్రీ మాష్టార్ గారు అకస్మాత్తుగా సమాధి చెందారు. నేను ఎంతగానో శోకసాగరంలో మునిగి పోయాను. ఒకసారి నాకు రక్తవిరోచనాలవుతున్నాయి. ఎన్ని వైద్యాలు చేసినా తగ్గలేదు. చివరకు మంచం దగ్గరే పోవలసిన స్థితి వచ్చింది. మానసికంగా కంట తడిపెట్టి శ్రీ మాష్టారికి విన్నవించుకున్నాను. ఆ నాటి నా స్వప్నంలో శ్రీ మాష్టారు నేను మామూలుగా వెళ్ళే హోటల్లో కూర్చోని ఇడ్లీ, మిరప్పొడి పెట్టమన్నట్లు కలవచ్చింది. తెల్లవారి నేనదేవిధంగా ఇడ్లీ, మిరప్పొడి ఆ హోటలులో తినగానే అన్నిరోజులు అంతగా బాధించిన రక్తవిరోచనాలు అంతులేకుండా పోయాయి.

శ్రీ మాష్టారికి సొంత ఇల్లులేదు. కట్టించాలని కొందరు భక్తులు, డబ్బు దండండి తర్వాత పని మొదలు పెట్టమని కొందరు. నేను కట్టిస్తానంటే అమ్మగారు "అట్లాగేలే" అంటారు గానీ పూర్తిగా సిగ్నల్ ఇవ్వలేదు. ఒకరోజు నాకు ఒక స్వప్నం వచ్చింది. భూమిలోకి ఒక మనిషి పట్టేటంతటి ముఖవైశాల్యంగల పైపులు ఎంతో లోతుగా దించబడి యున్నాయి. శ్రీ మాష్టారు, నేను ఆ పైపులు చూస్తున్నాము. ఉన్నట్లుండి శ్రీ మాష్టారు ఆ పైపులోకి దూకేశారు. నేను పట్టరాని దు:ఖంతో సార్, సార్ అని అరుస్తున్నాను. కొంతసేపటికి మాష్టర్‌గారు బయటికి వచ్చి "నీవు దూకుతావనుకున్నానే, దూక లేదేమి?" "సార్ నేను దూకితే మీ మీద పడుతును గదా. అందుకని దూకలేదు సార్" అన్నాను, ఆ స్వప్నం అంతరించింది.

దూకుతావనుకున్నాను, దూకలేదేమి అన్నమాట యొక్క అర్ధం - నా గృహనిర్మాణ పనిలో నీవు దూకుతావనుకున్నాను దూకలేదేమి అని మాష్టారు అడిగినట్లు నాకు హృదయగతమై అది మొదలు గట్టిగా అమ్మగారిని అడగడం వారు అంగీకరించడం ఎవరి అర్ధింపులూ లేకుండానే - సాయిబాబా పత్రికలో ప్రకటనతోనే ఆరు లక్షలు దక్షిణ ప్రోగయి శ్రీ మాష్టారి నివాసం ఒంగోలులో కట్టించడం జరిగింది. నాకు రెండవ జీవితం ప్రసాదించిన శ్రీ మాష్టారు గారికి నేనేమిచ్చి కూడా రుణం తీర్చుకోలేను.

రాధయ్యగారికి శ్రీ మాష్టారి గారి ఎడల గల భక్తి ఎంతటిదో తెలిపే సన్నివేశాలు - శ్రీ మాష్టారు గారి గృహనిర్మాణం జరుగుతుంది. బజారులో వేప పెండెలు కొన్నాము. అవి మోపు కట్టి అంగడిలో ఉన్నాయి. బండి వాడిని వచ్చి వాటిని బండిలో వేసుకోమన్నాము. నేను వచ్చినంతవరకు బండి ముందు నిలుచోండి. ఎద్దు కదిలి పోతుంది అన్నాడు. ఆ ఎద్దు పొడుస్తుందేమోనని నేను వెనుకాడాను. ఈ లోగా రాధయ్య ఆ పెండెల మోపు నెత్తిన బెట్టుకొని తెచ్చిబండిలో వేశాడు. అది చూస్తున్న అంగడి ఓనరు "వీడికేం గ్రహచారం పట్టింది, ఈ లక్షాదికారి ఆ మోపు మోయడమేమిటి" అన్నాడు. నేనా మాట రాధయ్యకు చెపితే "వాడికి శ్రీ మాష్టారి సంగతేమి తెలుసు, తెలిస్తే ఇంతకు పదిరెట్లు పనిచేయమంటాడు" అన్నాడు. మాష్టారి ఇల్లు పూర్తయినదాకా గాలి, వాన, ఎండ లేకుండా తిరిగాడు.



శ్రీ మాష్టారి గృహప్రవేశమయ్యాక నాకు గ్యాస్ట్రిక్ ట్రబుల్ వచ్చి ఇడ్లీ, చక్కెర, పాలు మాత్రం తీసుకుంటున్నాను. అమ్మగారితో పనుండి వాళ్ళ ఇంటికి పోతే ఇక్కడ భోంజేసి వెళ్ళమన్నారు. అక్కడ కూరలు, కొంచెం అన్నం కూడా తినలేక బాధపడుతూ ప్రసాదమని కళ్ళుమూసుకొని తిన్నాను. కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. కళ్ళు తుడుచుకుంటూ అమ్మగారికి నమస్కరించుకొని వచ్చేశాను. ఆ రోజు మొదలు గత పది సంతర్సరాలుగా మరలా గ్యాస్ట్రిక్ ట్రబుల్ బాధరాలేదు. అడిగితేనే కాదు అడగకున్నా బాధలు బాపే కరుణామయుడు శ్రీ మాష్టారు.

ఒకతను శ్రీ మాష్టారి దగ్గరకొచ్చి సార్! నేనిన్ని రోజుల నుండి మీ సత్ సంగానికి, భజనలకు వస్తున్నా నాలోని ఏ ఒక్క వ్యసనమూ పోలేదేమి సార్! అని అడిగారు. వెంటనే శ్రీ మాష్టారు నీవు పుట్టకముందు మీ ఇంట్లో పెండ్లికాని వారెవరైనా చనిపోయారా అన్నారు. అచ్చం నాలాగే ఉండే మా చిన్నాయన చనిపోయాడని మావాళ్ళంటుంటారు సార్ అన్నాను. మీ చిన్నాయనకు చాలా వ్యసనాలుండేవి. ఆయన ఖర్మ తీరి రథసప్తమినాడు శరీరం చాలించారు. ఆయనే నీ రూపంలో పుట్టి ఆ దుర్గుణాలన్నీ నీకు వచ్చి వేధిస్తున్నాయి. నీవు బాబాను నమ్మకొని సత్‌సంగాలకు పోతుండు ఆ దుర్గుణాలు వారి కృప వలన అవే పోతాయన్నారు. అతడు ఎంతో కాలంగా రథసప్తమినాడు మందిరానికి రావడం విశేషము. ఆయన అడగగానే ఆయన పూర్వజన్మ వృత్తాంతం శ్రీ మాష్టారు చెప్పడమే గొప్ప విశేషము.

ఒకసారి రఘురామరాజు గారనే టీచర్ ఒక ట్రాక్టరులో ఒక నులకమంచం తిరగ త్రిప్పివేసి ఫిట్స్ వచ్చిన తన కుమార్తెను ఆస్పత్రికి తీసుకుపోతూ ఆమెను తన ఒడిలో కూర్చోపెట్టు కున్నారు. ఆమె మన స్పృహలో లేరు. ఆమె కాలు మంచం కాళ్ళకట్ట తాడుకు రాసుకుంటూ గతుకులలో ట్రాక్టర్ అదుర్లకు కాలిలోని రక్తనాళం తెగి చాలా రక్తం పోయింది. అది రాజు గారు చూడలేదు. ఉదయగిరి వెళ్ళాక సెలైన్ పెడితే తెలివి వచ్చింది. కాలి గాయం వలన చాలా బాధపడుతుంది. ఇదేమిటబ్బా ఇలా అయిందే అని నిద్రపోయాడు. స్వప్నంలో శ్రీ మాష్టారు కన్పించి "ఒరేయ్! అది దైవసంకల్పానుసారం జరిగింది. ఆమెలో వాతం బాగా ప్రకోపించింది. అక్కడ తెగి వేడి పోవాలి. లేకుంటే ఆమెకు ప్రాణాపాయం. అందుకే భగవంతుడిలా చేశాడని" చెప్పారు. పిలవకుండానే రాజుగారిని ఓదార్చిన కరుణామయుడు గదా మాష్టారు.

## క్రిష్ణా జిల్లా నుండి విద్యానగర్ సాయి మందిరం చూడవచ్చిన భక్తుడు శ్రీ మాష్టారిని గురించి ఇలా చెప్పాడు.

ఒక రోజు శ్రీ మాష్టరు గారు మామిద్దె పైన సత్‌సంగం చేస్తున్నారు. మా పిన్నమ్మ కొడుకునకు ఫిట్స్ వచ్చి మా ఇంట్లో గిజ గిజ తన్నుకుంటున్నాడు. అక్కడ ఏ వాహనం లేనందున మా అమ్మ భయపడుతూ ఏడుస్తుంది. నేను వెళ్ళి మిద్దె మీద ఉన్న మానాన్న గారిని తీసుకవచ్చాను. ఆయన వస్తూనే



బిడ్డనెత్తుకుని మిద్దెమీదకు పోతుంటే - పిల్ల వానికి బాగ లేకుంటే డాక్టరు దగ్గరకు పోకుండా - ఆయనేమి చేస్తాడు అని మేమంతా కేకలేస్తున్నాము. ఇదే మీ పట్టించుకోకుండా ఆయన బిడ్డ నెత్తుకుని వెళ్ళి ఆతురతగా "సార్" అని అరిచారు. శ్రీ మాష్టారు ఆయన వైపు కూడా చూడకుండా మాట్లాడుతూనే "ఆగు" అన్నట్లు చేత్తో సైగ చేశారు. వెంటనే ఆ పిల్లవానికి ఫిట్స్ ఆగిపోయాయి. తన మాటలు పూర్తయ్యాక మా నాన్న వైపు తిరిగి ఏమిటని అడిగారు శ్రీ మాష్టారు. ఇలా జరిగిందని చెబితే అదంతా బాబా దయ అని పిల్లవానికి ఊది పెట్టారు. గత 15 సం|| నుండి ఆ పిల్లవానికి మరలా ఫిట్స్ రాలేదు. అని చెపుతూ శ్రీ మాష్టారి మహిమనెంతగానో కొనియాడారు.

## ఒంగోలు వాస్తవ్యులు శ్రీ సీతారామయ్య గారి భార్య శ్రీమతి సుబ్బలక్షమ్మ గారి అనుభవాలు

ఒకప్పుడు మాచాకుడు కుక్క రాజుకు తీవ్రమైన జబ్బు చేసి వళ్ళంతా పెద్ద పెద్ద పుండ్లు పడ్డాయి. నడవలేక బాధతో రోధిస్తుంది. దాని బాధ చూడలేక నాకుమారుడు సతీష్ శ్రీ మాష్టారి దగ్గర చెప్పి ఏడ్చేశాడు. వారు కొంచెం విభూది పెట్టి ఆ కుక్క మీద చల్లమన్నాడు. క్రమేణా దాని వ్యాధి పుండ్లు పూర్తిగా పోయి తిరగసాగింది. అంతకు ముందు దాన్ని పరీక్షించి ఆ జబ్బు తగ్గదని చెప్పిన డాక్టర్ రామ్మోహనరావు గారు దాన్ని చూసి చాలా ఆశ్చర్యపోయారు.

నేను మొదటి సారి షిరిడీ పోతూ శ్రీ మాష్టారి ఆశ్శీస్సుల కొరకు వెళ్ళాను. "శ్రీ మార్తాండ్ మహరాజ్ గారి దగ్గర బాబాగారిచ్చిన విభూది ఉంది. అడిగి తీసుకొని భద్రపరచుకో. మహాత్ముల స్పర్శ పొందిన వస్తువులు అస్సలు నిలబడవు. కాళ్ళు వచ్చినట్లు వెళ్ళిపోతాయి జాగ్రత్తగా దాచి పెట్టుకో" అని మాష్టరు గారు చెప్పారు.

నేనలాగే శ్రీ మార్తాండ్ మహారాజ్ గారి దగ్గర విభూది తీసుకుని ఆ పొట్లం చేతి గుడ్డలో కట్టి చాలా జాగ్రత్తగా ఉంచుకున్నాను. కానీ ఇంటికి వచ్చి చూచుకుంటే లేదు. ఈ విషయం శ్రీ మాష్టారికి చెప్పలేదు.

అప్పుడు శ్రీ మాష్టారు విద్యానగరులో ఉండి దత్త క్షేత్రాలకు రైలులో వేళ్తూ ఉన్నారు. "రైలు స్టేషనులో ఆగుతుంది. వచ్చి కలుసుకో" మన్నారు. వారి దర్శనార్ధం చాలా మందిమి రైల్వే స్టేషను వెళ్ళాము. శ్రీ మాష్టారు రైలు దిగి "నీవు పోగొట్టుకున్న వస్తువు నాదగ్గరకు చేరింది. అని చెపుతూ ఆ విభూది అందరికీ పెట్టారు." నా విభూది పోయిన విషయం నేను వారికి చెప్పకున్నా వారి కెలా తెలిసింది. సర్వజ్ఞులంటే ఇదే గదా అని ఆశ్చర్యపోయాను.

నా మిత్రులతో శ్రీశైలం పోతూ సార్! "పూర్ణానంద స్వామి వారి దర్శనం లభించేటట్లయితే పోతాను లేకుంటే పోనన్నాను" తప్పక దర్శనమౌతుందని ఆశీర్వదించారు. శ్రీశైలం



వెళ్ళి సున్నిపెంటలో విచారించినా హఠకేశ్వరంలో విచారించగా శ్రీ స్వామి వారు లేరని చెప్పారు. నేను శివుని సన్నిధిలో కూడా శ్రీ పూర్ణానంద స్వామి దర్శనార్ధం శ్రీ గురు చరిత్ర పారాయణ చేశాను. శ్రీ మాష్టారి మాట వ్యర్థంకాదని తిరుగుప్రయాణంలో మరలా హఠకేశ్వరంలో విచారిస్తుంటే నాతోటి వారంతా నేనొక మొండి మనిషినంటున్నారు. అక్కడొక మనిషి డబ్బులిస్తే చెప్తానన్నాడు. అందరూ ఇవ్వవద్దన్నా నేను వినకుండా ఇచ్చాను. శ్రీ స్వామివారు ఇప్పుడే వచ్చారు వెళ్ళమన్నాడు. శ్రీ మాష్టారి మాట ఎన్నటికీ వ్యర్థంకాదని నమ్మిన నేను వాళ్ళందరినీ అక్కడుండమని నేను ఆశ్రమానికి వెళితే శ్రీ స్వామివారు అప్పుడే వచ్చియున్నారు. శ్రీ స్వామివారి దర్శనమైంది. "నిన్నెక్కడో చూచానమ్మా" అన్నారు. మేమొకసారి హటకేశ్వరం వచ్చాము స్వామి అంటే "కళ్ళతో చూచే చూపుకాదు. మనస్సుతో చూచే చూపే చూపు" అన్నారు. "క్రిందటి రాత్రినుండి ఎందుకో ఆశ్రమానికి వచ్చేద్దామని తీవ్రంగా అన్పించి వచ్చేశాను" అన్నారు శ్రీ స్వామివారు.

తప్పక స్వామిదర్శనమౌతుందని శ్రీ మాష్టారు ఆశీర్వదించిన క్షణమే వారు ఆశ్రమానికి పోవాలనుకుని కదిలారు. విశ్వ చైతన్యముతో తాదాత్మ్యం చెందిన మహనీయులందరి సంకల్పాలు ఒకే విధంగా ఉంటాయి.

ఒకసారి నాకుమారుడు సతీష్ తన మైనింగ్ సర్టిఫికేట్లకోసం ధన్‌బాద్ పోతూ మాష్టారికి నమస్కరిస్తే,

శ్రీ మాష్టారతని చేతిలో చేయి వేసి "సర్టిఫికేట్లు వచ్చినా రాకపోయినా ఒకేలాగా ఉండాలి" అని విభూతినిచ్చారు. సర్టిఫికేట్లు రాలేదు. తిరుగు ప్రయాణంలో రైలు తుఫానులో చిక్కుకున్నది. కొద్దిలో పెద్ద ముప్పు తప్పిపోయింది. అదే సమయంలో నా స్వప్నంలో ఒకరు శ్రీ మాష్టారిని నాకు చూపిస్తూ వీరే నీబిడ్డను రక్షించింది" అని చెపుతున్నారు. అతడింటికి వచ్చి తుఫానులో ప్రమాదం చెప్పాడు. విభూతినిచ్చేటప్పుడే మాష్టారు సర్టిఫికేట్లు రావని సూచించారు, కానీ మేము గుర్తించలేదు. తర్వాత 40 రోజులు పారాయణ చేస్తే వచ్చాయి.

ఒకసారి నేనొక పని కొరకు పారాయణ చేస్తే అది కాలేదు. శ్రీ మాష్టారికి చెపితే అన్నారు "మనింట్లో భార్యాబిడ్డలు ముద్దుచేస్తే ఎన్నిసార్లు మురిపంచేశాము అని లెక్కపెట్టుకోము గదా! అలానే బాబా మనకు ప్రసాదించే అర్హత వచ్చేవరకూ పారాయణ చేస్తుండాలి" అని చెప్పారు. ఈ మాట మనందరికీ మంచి పాఠమే.

నిష్కామ కర్మ ఏ భావంతో చేయాలో ఆచరించి చూపిన మహనీయుడు శ్రీ మాష్టారు గారు.

ఒకప్పుడు విద్యానగర్ మందిర నిర్మాణానికి శ్రీ మాష్టారు గూడ కలిచేడులో భిక్ష స్వీకరించే నిమిత్తం వచ్చారు. ఒక డబ్బుగల ఉద్యోగి దగ్గరకెళితే లేదంటే లేదని మమ్ములను వట్టిచేతులతో త్రిప్పి పంపేశారు. అప్పుడు సత్‌సంగసభ్యుడు



ఒకరు "సార్ వీళ్ళు ఇలా చేస్తారని తెలిసుంటే మిమ్ములను ఇక్కడకు తీసుకురాకుండా ఉండేవాళ్ళము" అని అన్నాడు. వెంటనే శ్రీ మాష్టారు అన్నారు, "వాళ్ళిచ్చే డబ్బుకొరకు కాదు మనమీ భిక్షకు రావడం. భిక్ష ఇవ్వడం, తిరస్కరించడం రెంటినీ సమభావంతో తీసుకునే మనో వైఖరి నేర్చుకునేందుకే వస్తున్నాము. దాతలను ప్రేరేపించేవారు శ్రీ సాయినాధుడే అనే విషయం మనమెప్పుడూ మరువకూడదు, అని సెలవిచ్చారు.

మరియొకరి దగ్గరకెళితే అతడు ఎంతో ధనవంతుడే. కానీ పావలా ఇచ్చారు. శ్రీ మాష్టారు ఆ పావలాను బాబా ప్రసాదంగా రెండు చేతులతో స్వీకరించి కళ్ళకద్దుకుని జేబులో వేసుకున్నారు. వారికి ఇచ్చే దాతలు, ఇవ్వని వారు, ఇద్దరూ కూడా బాబా రూపాలుగా కనిపిస్తున్నారని తెలుస్తుంది.

ఒంగోలులోని శ్రీ మాష్టారి ప్రింటింగ్ ప్రెస్‌లో శివ అనే వారు పనిచేస్తుండేవారు. అతడు పనిచాలా చక్కగాను తొందరగానూ చేసేవాడు. గనుక అతడు రేపు పనికి రాడేమోనని విక్రం గారు రోజు పది రూ|| నిలుపుకొని అతని కూలి ఇచ్చేవాడు. అట్లాగైనా రేపతడు పనికి వస్తాడనేది వారి ఉద్దేశ్యము.

అతడెంత బాగా పనిచేస్తాడో అంత త్రాగుబోతు. తన డబ్బంతా తాగుడుకే పెట్టి వట్టి చేతులతో ఇంటికి పోయేవాడు. భార్యను ఆ నిషాలో బాగా కొట్టేవాడు. నిషా తగ్గాక తెల్లవారి

"అయ్యో నిన్న కొట్టానా!" అని మంచిగా మాట్లాడేవాడు. ఆమెకు ఇల్లొక నరకంగా ఉంది.

ఒకరోజు "యేయ్ నేనేమీ మీ యబ్బకు బాకీ ఉన్నానా. నా పది రూపాయలు నాకిచ్చేయ్" మని విక్రం గారితో గలాట పడ్డాడు. అతడప్పటికే తాగి వచ్చాడు. విక్రం గారు అతనిని శ్రీ మాష్టారి దగ్గరకు ప్రసాదునిచ్చి పంపాడు. శ్రీ మాష్టారితో కూడా అలాగే అమర్యాదగా మాట్లాడాడు. అతని తగవేమిటో ప్రసాద్ ద్వారా విని శ్రీ మాష్టార్ అతనికి పది రూపాయలు ఇప్పించి పంపేశారు. అతను తాగి వచ్చి అలా మాట్లాడు తున్నాడని శ్రీ మాష్టార్‌గారికి బాగా అర్థమైంది.

అంతే శ్రీ మాష్టారు ఏమి సంకల్పించారో గానీ మరురోజు నుండి మరలా త్రాగుడు పూర్తిగా మానేశాడు. అంతేగాక శ్రీ మాష్టారికి ప్రాణానికి ప్రాణమిచ్చే భక్తుడుగా మారిపోయాడు.

శ్రీ మాష్టారు ఓపెన్ ఎంక్వయిరీ తర్వాత విద్యానగర్ కాలేజిలో చేరబోతున్నారు. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందోనని అందరూ మదనపడుతుంటే శ్రీ మాష్టారికి తోడుగా నేను పోతానన్నాడు శివ. శ్రీ మాష్టారు వద్దన్నా వినకుండా వారికి తెలియకుండా విద్యానగర్ వెళ్ళి అచ్చటి పరిస్థితులు గమనిస్తూ మూడు రోజులుండి వచ్చాడు. అక్కడ ప్రశాంతంగానే ఉండడంతో వచ్చేశాడు. ఈ విధంగా వారి సంకల్ప బలంతో శ్రీ మాష్టరుగారు ఎందరి కాపురాలు ఉద్ధరించారో చెప్పగలమా!



## బాబా సేవ అని డబ్బు గడించే వారందరికీ శ్రీ మాష్టారు తన ఆచరణతో బోధించిన దివ్య మార్గము

అవి సాయిబాబా పక్ష పత్రిక పెట్టిన కొత్త రోజులు. శ్రీ మాష్టారు పత్రికకు చందదారులను చేర్పించమని తనకు తెలిసినవాళ్ళందరికీ చెపుతున్నారు. నిత్యం పత్రికకు వ్యాసాలు వ్రాయడం, ప్రింటింగులో ప్రూఫులు దిద్దిటం చాలా కష్టమైన పని. శ్రీ మాష్టారు పర్యటనకు వెళ్ళితే అమ్మగారు ప్రూఫులు దిద్దాలి. ఇదంతా చూచిన శ్రీ ప్రకాశరావు గారు "సార్! ఈ పత్రిక పని చాలా కష్టము. దీనిని లేకుండా చేస్తే మీకు హాయిగా ఉంటుంది" అని వ్రాసారు. అందుకు శ్రీ మాష్టారు ఇచ్చిన సమాధానం బాబా సేవ అని డబ్బుగడించే వారందరికీ గొప్ప పాఠం. మాష్టారు వ్రాసిన సమాధానం - "నేనొక కార్మికునివలె పనిచేసి నా కుటుంబాన్ని పోషించుకోవాలి" అని వ్రాశారు. ఆ మహనీయుడు కార్మికుని వలె కృషి చేయుటకే నిశ్చయించు కున్నారు గాని సాయిబాబాకు గాను తన చేతి కొచ్చే దక్షిణలను ఒక్క పైసా తన కుటుంబమునకు వాడే వారు కాదు. మద్రాస్ - S. లక్ష్మిగారు వ్రాస్తున్నారు - విదేశంనుండి వచ్చిన భారతీయులు శ్రీ మాష్టార్ చేతికి డొనేషన్‌గా ఇవ్వబోతే - ఆ డొనేషన్ నాచేతికొద్దు ప్రెస్‌కు వెళ్ళి సాయిబాబా మిషన్‌కు చెల్లించి రసీదు తీసుకోమన్నారు.

మరి ఈ కలియుగ సాయిసేవకులు సాయిబాబాకు పూజలు చేస్తాం. వ్రతాలు చేస్తామని డబ్బుగుంజే వారికి పైమాట కనువిప్పు కల్గించవలెనని ఆశిస్తున్నాను. ఏవిధంగానూ బ్రతుకు తెరవు లేకుంటే తన పొట్ట కొరకు బాబా డబ్బు తీసుకున్నా పరవాలేదు కానీ అంతకు మించి ఆశిస్తే అది మన దరిద్రానికే మూలము.

## శ్రీ సాయి, శ్రీ మాష్టారు బోధించే దేమిటి? మనం చేసేదేమిటి?

శ్రీ మాష్టారు తరించారు. మనం తరించే మార్గమేమిటి? వారి బోధల యందు విశ్వాసముంచి ఆచరిస్తే తరిస్తాము. ఈ మందిరాన్ని భిక్షమెత్తి కట్టించారు. ఓరేయ్ కావాలంటే తెల్లవారేసరికి మందిరం లేపేయగలను. నా పాత విద్యార్థులు ఇన్‌కమ్‌టాక్స్ అఫీసర్లు ఉన్నారు. వాళ్ళకు చెపితే పని అయిపోతుంది కాని అది మంచి పద్ధతి కాదు. చెమటతో ఆయన మందిరం నిలవాలి. అందరూ ఇది మామందిరమనాలి అని ఇలా భిక్షానికే వస్తున్నానన్నారు. ఈనాడు మనం అలానే చేస్తున్నామా?

ఆయన చద్దన్నంతిని ఒక డాక్టరును పోషించారు. అంతే గాక ఇంట్లో ఐదుగురు బయట మెస్‌లో 8 మందికి పర్మినెంట్‌గా భోజనాలు పెట్టారు. వాళ్ళేగాక నిత్యం వచ్చిపోయే విజిటర్స్‌కు భోజనాలు పెట్టారు. ఇప్పుడుమనం ఎంత మందికి వైద్య



సహాయమందిస్తున్నాము. ఎంతమంది నిరుపేదలలో బాబాను చూచి వైద్యం కాని జీవనభృతి కాని అందిస్తున్నాము. ఇళ్ళు లేని నిరుపేదలను ఎందరిని ఆదుకున్నాము.

శ్రీ మాష్టరు గారు ఎందరు విద్యార్థులను పోస్ట్ గ్రాడ్యుయేట్లుగా తన ఖర్చుతో తయారు చేశారు. మనం అందరం కలిసైనా కనీసం ఒక్క పేద బ్రిలియంట్ విద్యార్థిని ఆదుకున్నామా?

ఋణానుబంధాన్ని విశ్వసించు. ఏ ప్రాణినీ తోలెయ్య్యొ వద్దన్న మాటకు కట్టుబడి తననాశ్రయించిన వారందరికీ, వైద్యం దగ్గర నుండి క్రాపు చేసుకునేందుకు ఖర్చుగూడా ఇచ్చారు.

ఎన్నో అత్యుత్తమ గ్రంధాలు మనకందుబాటులోకి తెచ్చారు. మరి మనం ఒక్క గ్రంధమైనా మనమందిరం ఫండ్స్ నుండి తయారుచేసి లాభాలు లేకుండా ప్రజలకు అందిస్తున్నామా?

ఒంగోలుకు వెళ్ళాక ఆరు నెలలు ఆర్థిక ఇబ్బంది వలన కూర లేకుండా, టూత్‌పేస్టులు బ్రష్షులు లేకుండా కాఫీలు కూడా మాని వెలలేని బుక్స్ అందించారు. మనం సుష్టుగా భోంచేసి తలా ఒక్క రూపాయి ప్రక్కనబెట్టి ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక లైబ్రరీ చేపడితే ఎంత బాగుంటుంది.

ఈ రోజు మనం షడ్రసోపేతంగా తిన్న అన్నం రేపటికి ఉంటుందా? నాలుక దాటితే ఏదైనా ఒకటే. పాలరాతి విగ్రహాలు వారు పెట్టించలేకనా? ఆ ఖర్చుతో ఆర్తులనాదు కోవాలనేదే వారి ధ్యేయం. వెండి, బంగారం, బాబాకు సమర్పించాక వాటితో ఆయన మురిసిపోతారా? ఆ డబ్బుతో అంతటా అందరిలో ఉన్న సాయికి సేవ చేస్తే సంతోషిస్తారా? ఆయన దగ్గర మేలు పొంది, ఎంతో విజ్ఞానమార్జించిన మనమే వడ్డీ వ్యాపారాలు చేస్తే వారు సంతోషిస్తారా? ఆ డబ్బుతో తనకు సింహాసనమేస్తే ఆయన ఆశీనులౌతారా?

దేశంలో ఎందరో మహనీయులు ఉన్నారు. వారిని ఇక్కడకు రప్పించేందుకు మనమెన్ని సామూహిక పారాయణలు, ధ్యానాలు చేశాము.

ఇంకెన్నో వారు చెప్పిన కార్యక్రమాలున్నాయి. వాటిని ప్రక్కకునెట్టి - పోటీలు వంతులు కీచులాటలు మానితే దేవుడు కాపాడుతాడు అని వారు చెబితే మనమిప్పుడు పదవులకై తన్నుకుంటున్నాము. ఇదంతా చూసి ఆయన నవ్వుకుంటారు. వాళ్ళ కంటే మనం ఈసమ్మేళనం బాగా చేశామని అందరూ అనుకోవాలి అనే పోటీ భావం మనలో వచ్చాక ఇక చేసి మాత్రం ప్రయోజనమేమిటి? ఆలోచించండి. ఆశీనులైన పెద్దలు ఆచరించండి.



వారి ఆచరణ, వారు వ్రాసిన సాయి లీలామృతమే మనకుమార్గ దర్శకాలు.

## భక్తులకు విజ్ఞప్తి:

పూజ్యపాదులు శ్రీ భరద్వాజ మాస్టారు గారు జ్ఞానేశ్వరీ భగవద్గీత తప్ప మరే భగవద్గీత చదువవద్దని సలహా ఇచ్చారు. ఈ జ్ఞానేశ్వరమహరాజ్ పన్నెండు సంవత్సరముల పిల్లవాడు, ఎవరూ రాయని విధంగా భగవద్గీతకు వ్యాఖ్యానము వ్రాశారు. పదహారవ అధ్యాయం - దైవీ సంపద్విభావ యోగంలో ధర్మకార్యములు చేయువారు, తమ పేరును నలుదిక్కులకు చాటుకొన్నచో - ఈ లోకమందును, పరలోకమందును మనకు స్నేహపూర్ణుడగు ధర్మం కూడా అధర్మమే అగును అంటారు. అందుకే ఆచార్యుల వారు విద్యానగర్ లోని శ్రీ సాయి మందిరములో దాతలు పేర్లు ఎక్కడా ప్రకటించలేదు. నేటి కలికాలంలో దానం చేసిన బాడీ గుడ్డలు మొదలు ప్రతి వాని పైనా దాతలు పేర్లు వ్రాయించు కొనుట ఎంత అనర్ధమో యోచించండి.

ఈ భగవద్గీతలో ఈ మహనీయుడు అనేకచోట్ల భోదించిన భోదలన్నీయు మానవోద్ధరణకు ఎంతగా ఉపయోగ పడునో చెప్పనలవికాదు.

పన్నెండు సంవత్సరముల పిల్లవాడు -

1. దున్నపోతు చేత వేదం నాలుగు గంటలసేపు సస్వరముగా చెప్పించారు.
2. మొండి గోడను నడిపించారు.
3. చనిపోయిన వానిని బ్రతికించారు.
4. శ్రాద్ధమురోజు పితృ దేవతలను రప్పించారు.
5. యోగ శక్తితో తన వీపునే పెనంగా మార్చి దోసెలు పోయించారు. ఈ మహనీయుని సమాధి అళంది (మహారాష్ట్ర) గ్రామమున కలదు.

వీరి భగవద్గీత నవరత్న ప్రింటర్స్, విజయవాడలోనూ శ్రీ వెంకట్రామ బుక్ షాపులన్నింటిలోనూ ఇటీవలే అమ్ముచున్నారు. అందరూ కొని చదివి తరించాలని నా అభిలాష. ఆధ్యాత్మికతలో ఏమి చేయాలో తెలుసుకోవడం గొప్ప మెట్టని శ్రీ మాష్టారు చెప్పేవారు. వీరి జీవిత చరిత్ర ప్రచురించాలని నా ఆశయం. శ్రీ మాష్టారు వీరి జీవిత చరిత్ర మనందరికీ లభ్యమయ్యేటట్లు చేయాలని ప్రార్థిస్తున్నాను.

<u>ప్రతులకు</u>

పె. సుబ్బరామయ్య
గొలగమూడి
నెల్లూరు జిల్లా - 524321